# మహి న్యూస్

MAHI NEWS

www.mahinewsindia.com

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక








ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 207 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, | పేజీలు : 8 | వెల రూ. 2 | మంగళవారం -27 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana


## ‘అర్ణాబ్’ తీవ్రతను గుర్తించిన ఇస్రో శాటిలైట్..

### తీర ప్రాంతాల అప్రమత్తం




బంగాళాఖాతంలో వేగంగా బలపడుతున్న ‘అర్ణాబ్’ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతున్న నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం

## రేవంత్ సర్కార్‌కు నీళ్లు తీసుకునే తెలివి లేదు..




హైదరాబాద్, : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై గులాబీ పార్టీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. తెలంగాణలో సాగునీటి నిర్వహణపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుపడుతూ బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ప్రస్తుత ప్రభుత్వానికి నదుల నుంచి నీటిని ఒడిసిపట్టే కనీస పరిజ్ఞానం లేదని మండిపడ్డారు. ఎల్నినో ప్రభావం, తాగు, సాగునీటి ఎద్దడిపై ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేదని ధ్వజమెత్తారు.

## ఇతర పార్టీల్లో చేరడం రాజకీయ ప్రక్రియలో భాగం : సుప్రీంకోర్టు




ఢిల్లీ : ఒక రాజకీయ నేత తన సొంత పార్టీని వదిలిపెట్టి, మరో పార్టీలో చేరడం అనేది రాజకీయ ప్రక్రియలో ఓ భాగమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తమిళనాడు రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకేకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి అధికార టీవీకేలో చేరారు. ఈ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. వేరే పార్టీకి వెళ్లాలనుకున్న వారు రాజీనామా చేసే వెళ్తారని.. అది రాజకీయ ప్రక్రియలో భాగమని పేర్కొంది.




## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర.. కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!

హైదరాబాద్: తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న ‘ఓట్ చోరీ’ వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ‘లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో’ (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

## ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు..
## తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు

- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు
- అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం అని వ్యాఖ్య




హైదరాబాద్, : ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన

# తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్..
## తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం
- ముంపుభూములకు పరిహారం చెల్లిస్తామని హామీ




ఢిల్లీ: తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ గారితో సమావేశమయ్యారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన ఈ భేటీలో నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, తెలంగాణ, మహారాష్ట్రల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయి. బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రతినిధి బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడి పోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు.

## రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట..
## అమిత్ షా కేసులో కీలక తీర్పు!

- ★ అమిత్ షాపై వ్యాఖ్యల కేసులో రాహుల్ నిర్దోషిగా తీర్పు
- ★ రాహుల్ వ్యాఖ్యలు పరువునష్టం కాదని కోర్టు స్పష్టీకరణ
- ★ 2018 కర్ణాటక ఎన్నికల ప్రచారంలో ఈ వ్యాఖ్యలు
- ★ బీజేపీ నేత విజయ్ మిశ్రా ఫిర్యాదుతో విచారణ
- ★ 2023లో కోర్టుకు హాజరై బెయిల్ పొందిన రాహుల్




### రాహుల్ గాంధీకి బిగ్ రిలీఫ్..

ఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి న్యాయస్థానంలో ఊరట లభించింది. బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువు నష్టం కేసులో ఉత్తర ప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించే స్వభావం కలిగి లేవని కోర్టు పేర్కొంది.




## రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఎంపీ గురుమూర్తి లేఖ

## చెస్ క్రీడాకారుడు గ్రాండ్‌మాస్టర్ లలిత్ బాబుకు వైఎస్ జగన్ అభినందనలు




తాడేపల్లి: చెస్ క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఎం.ఆర్. లలిత్ బాబుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. జర్మనీ వేదికగా జరిగిన 43వ మున్‌స్టర్‌లాండ్ ఓపెన్--2026 చెస్ టోర్నమెంట్‌లో అద్భుత విజయం సాధించి, ఛాంపియన్‌గా నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. విజయవాడకు చెందిన లలిత్ బాబు తన అసాధారణ ప్రతిభ, పట్టుదలతో అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటారని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశ చెస్ క్రీడకు ఆయన గర్వకారణంగా నిలిచారని, వర్ధమాన యువ క్రీడాకారులకు లలిత్ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులోనూ లలిత్ బాబు మరిన్ని గొప్ప విజయాలు సాధించి, రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని మనసారా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సై ప్రియాంకపై గుంటూరు ఎస్పీకి విడదల రజని ఫిర్యాదు




మహిళా ఎస్సై తనతో అనుచితంగా ప్రవర్తించి కిందకు తోసేశారని రజని ఆరోపణ

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని విమర్శ

ఎస్సైపై చర్యలు తీసుకోకపోతే కోర్టుకు వెళతామని హెచ్చరిక

## ఎక్కడా కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు..
# అధికారులకు చంద్రబాబు కీలక ఆదేశాలు

- అర్ణబ్ తుపాను ముప్పు నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష
- ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం
- బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు, ఏపీ తీరానికి రెడ్ అలర్ట్ జారీ
- తీరప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్లకు సూచన




అమరావతి,: బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్ణబ్’ తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగాన్ని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశారు. తుపాను కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, దాని తీవ్రతకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. “తుపాను ప్రభావంతో కురిసే వర్షాలు, వీచే గాలులు, సంభవించే వరద ప్రవాహాల తీవ్రతను ముందుగానే అంచనా వేయాలి. గతంలో వచ్చిన తుపానుల సమాచారాన్ని విశ్లేషించి రైతులకు, ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలి. ఎలాంటి నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది” అని చంద్రబాబు అన్నారు. తీరప్రాంతాల్లోని ప్రజలను వెంటనే గుర్తించి, సమీపంలోని తుపాను షెల్టర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఆర్టీజీఎస్, విపత్తు నిర్వహణ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల కలెక్టర్లు, పోలీసు అధికారులు వర్చువల్ విధానంలో హాజరై తమ జిల్లాల్లోని పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలను ముఖ్యమంత్రికి వివరించారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, ‘అర్ణబ్’ తుపాను అక్టోబర్ 26 అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, 27న అతి తీవ్ర తుపానుగా బలపడనుంది. అక్టోబర్ 28వ తేదీ ఉదయం బాపట్ల--విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది.

## అవి ఏకగ్రీవాలు కాదు..
## కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు: షర్మిల




స్థానిక సంస్థల ఏకగ్రీవాలపై షర్మిల ఫైర్

కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని విమర్శ

ఈసీ, పోలీసు వ్యవస్థలను కూటమి నిర్వీర్యం చేసిందని వ్యాఖ్య

ఏకగ్రీవ ఫలితాలను నిలిపివేసి, విచారణ జరపాలని డిమాండ్

అమరావతి,: రాష్ట్రంలో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో నమోదైన ఏకగ్రీవాలపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇవి ప్రజల ఆమోదంతో జరిగిన ఏకగ్రీవాలు కావని, అధికార మదంతో కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు.

## ‘అర్ణబ్’ తుపానుపై వదంతులు నమ్మొద్దు.. అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం: అచ్చెన్నాయుడు




బంగాళాఖాతంలో ‘అర్ణబ్’ తుపాను నేటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం

ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ

రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన

అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి,: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు ‘అర్ణబ్’ అని నామకరణం చేశారు. ‘అర్ణబ్’ తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు,స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## 'అర్ణాబ్' తీవ్రతను గుర్తించిన ఇస్రో శాటిలైట్..

# తీర ప్రాంతాల అప్రమత్తం

ఢిల్లీ: బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణాబ్' తుపాను అత్యంత వేగంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు దూసుకొస్తోంది. ఈ తుఫాను కదలికలను ఇస్రో శాటిలైట్లు స్పష్టంగా చిత్రీకరించాయి. తుపాను తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆంధ్రప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు రెడ్-లెవెల్ తుపాను హెచ్చరికను జారీ చేసింది. దీంతో తీర ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం, ఈ తుపాను సోమవారం (అక్టోబర్ 26) అర్ధరాత్రి నాటికి తీవ్ర తుపానుగా మారనుంది. అనంతరం మరింత బలపడి, అక్టోబర్ 27 నాటికి అతి తీవ్ర తుపానుగా పరిణామం చెందే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇస్రో పంపిన ఉపగ్రహ చిత్రాలలో దట్టమైన మేఘాలు, స్పష్టమైన కేంద్రకంతో ఈ తుపాను వ్యవస్థీకృతంగా బలపడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ తుపాను తూర్పు-మధ్య, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉంది. ఇది విశాఖపట్నానికి ఆగ్నేయంగా సుమారు 650 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తొలుత పశ్చిమ-వాయవ్య దిశగా కదిలి, ఆ తర్వాత వాయువ్య దిశగా తిరిగి ఏపీ తీరం వైపు ప్రయాణిస్తుందని తెలిపారు. అక్టోబర్ 28వ తేదీ ఉదయం సమయంలో ఈ తుపాను బాపట్ల, విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. తుపాను తీరం దాటే సమయంలో గాలి వేగం గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వరకు ఉండవచ్చని, కొన్ని సమయాల్లో గంటకు 140 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు అన్ని రకాల సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## రేవంత్ సర్కార్‌కు నీళ్లు తీసుకునే తెలివి లేదు..

మొదటి పేజి తరువాయి

ఎల్నినో ప్రభావం, తాగు, సాగునీటి ఎద్దడిపై ప్రభుత్వానికి ఎలాంటి పట్టింపు లేదని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా ఎంతో చాకచక్యంగా నీటిని తరలించుకుపోతుంటే.. మన ప్రభుత్వం మాత్రం దేవాదుల నుంచి నీటిని ఎందుకు ఎత్తలేకపోయిందని నిలదీశారు.

కేసీఆర్‌కు పేరు వస్తుందనే మోటార్లు ఆన్ చేయలేదు

గత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల ద్వారా నీటిని తరలించడంలో ప్రస్తుత పాలకులు విఫలమయ్యారని హరీష్ రావు ఆరోపించారు. దేవాదుల ప్రాజెక్టును సక్రమంగా నడిపించి ఉంటే వరంగల్, కరీంనగర్ జిల్లాల రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెండేది కాదని స్పష్టం చేశారు. కేవలం కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే దుర్బుద్ధితోనే కన్నెపల్లి మోటార్లను ఆన్ చేయలేదని ఆరోపించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యల కోసం, రాజకీయ లబ్ధి కోసమే గత మూడు సంవత్సరాలుగా నీళ్లు ఎత్తకుండా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ఆనాడు కాంగ్రెస్ పార్టీనే సర్వనాశనం చేసిందని దుయ్యబట్టారు.

మహారాష్ట్ర చర్చలపై ఎద్దేవా.. తుమ్మిడిహెట్టిపై సవాల్

అధికారంలోకి వచ్చిన 1054 రోజుల తర్వాత ప్రభుత్వం ఇప్పుడు మహారాష్ట్రతో చర్చలకు వెళ్లడాన్ని హరీష్ రావు ఎద్దేవా చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద తెలంగాణకు వాడుకునేందుకు నీళ్లు లేవని కేంద్ర వాటర్ కమిషన్ స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే, ఒక్క ఎకరాకు కూడా ఆయకట్టు లేని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.25 వేల కోట్లు ఖర్చు చేయడం దేనికని ప్రశ్నించారు. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించడం అసాధ్యమని, ఒకవేళ గ్రావిటీ ద్వారా నీళ్లు తెచ్చి చూపిస్తే తాను తన పదవికి రాజీనామా చేస్తానని హరీష్ రావు సవాల్ విసిరారు. గ్రావిటీ ద్వారా నీళ్లు ఎలా వస్తాయో నీటిపారుదల శాఖ మంత్రి నిరూపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షం ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధపడి, నీళ్లు తెప్పించలేకపోతే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా అంటూ ఆయన గట్టిగా సవాలు విసిరారు.

## ఇతర పార్టీల్లో చేరడం రాజకీయ ప్రక్రియలో భాగం : సుప్రీంకోర్టు



మొదటి పేజి తరువాయి

వేరే పార్టీకి వెళ్లాలనుకున్న వారు రాజీనామా చేసే వెళ్తారని.. అది రాజకీయ ప్రక్రియలో భాగమని పేర్కొంది. రాజీనామా, అనర్హత వేటు అనేవి వేర్వేరు రాజ్యాంగ ప్రక్రియలు అని.. వాటిపై పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని తెలిపింది. అనర్హత పిటిషన్ విచారణను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామాలు, పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. పార్టీ మారిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ఐదేళ్లపాటు అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పార్టీ నేతలు ఇటీవల మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో, ఎన్నికల సంఘం, తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారికి ఒక ఆదేశం జారీ చేయాలని కోరారు. దీని ప్రకారం, స్వచ్ఛందంగా రాజీనామా చేసిన ఎమ్మెల్యే, ఆ రాజీనామా వల్ల ఏర్పడే ఉప ఎన్నికలో తిరిగి పోటీ చేయాలనుకుంటే.. దాని నిర్వహణకు అయ్యే ప్రభుత్వ వ్యయంతో సమానమైన మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించిన తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ.. పిటిషనర్ సుప్రీంను ఆశ్రయించారు.

## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

## కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!



మొదటి పేజి తరువాయి

'లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు..

## తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు



మొదటి పేజి తరువాయి

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. 'మోదీ కా బాప్ భీ జాయేగా' (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

## తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్.. తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!

మొదటి పేజి తరువాయి



ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్ బీ చవాన్ గారి మధ్య కుదిరిన ఒప్పందం నుంచి.. వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను తెలిపారు. 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తుచేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. అందుకే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గారు స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు.

రెండు రాష్ట్రాలకు వారధి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు మాట్లాడుతూ, తెలంగాణ - మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని తెలిపారు. అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను మహారాష్ట్ర సీఎం గారి దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదన్నారు. రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రి గారికి విజ్ఞప్తి చేశారు.

సానుకూలంగా స్పందించిన మహారాష్ట్ర సీఎం గారు

తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించారు. తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పున: పరిశీలించేందుకు అభ్యంతరం లేదన్నారు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తుచేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (జఔజ) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతుందని తెలిపారు. సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోపు రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ గారు ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.

## రాహుల్ గాంధీకి కోర్టులో భారీ ఊరట.. అమిత్ షా కేసులో కీలక తీర్పు!

మొదటి పేజి తరువాయి

రాహుల్ చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించే స్వభావం కలిగి లేవని కోర్టు పేర్కొంది. కాగా, తీర్పు వెలువడే సమయంలో రాహుల్ గాంధీ స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఈ వివాదం తలెత్తింది. అప్పట్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షాపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని ఆరోపిస్తూ స్థానిక బీజేపీ నేత విజయ్ మిశ్రా పరువు నష్టం ఫిర్యాదు చేశారు. 2018 ఆగస్టు 4న ఆయన ఈ ఫిర్యాదును దాఖలు చేశారు. బెంగళూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ అమిత్ షాను హత్య కేసులో నిందితుడిగా పేర్కొన్నారని ఫిర్యాదుదారు ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వల్ల అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్లు 499, 500 కింద క్రిమినల్ పరువు నష్టం కేసు నమోదైంది.

సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసు ప్రస్తావన

రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసుకు సంబంధించినవిగా వార్తా నివేదికలు పేర్కొన్నాయి. ఈ కేసులో అమిత్ షాను 2014లో ముంబైలోని ప్రత్యేక సీబీఐ కోర్టు అభియోగాల నుంచి విముక్తి చేసింది. అయితే, 2018లో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేవిగా ఉన్నాయని ఫిర్యాదుదారు వాదించారు. మరోవైపు, తన వ్యాఖ్యలను సందర్భం నుంచి వేరు చేసి చూపించారని రాహుల్ గాంధీ ఆరోపణలను ఖండించారు. ఈ నేపథ్యంలో ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాల ఆధారంగా కోర్టులో విచారణ కొనసాగింది.



ఐదేళ్లకు పైగా కొనసాగిన న్యాయపోరాటం

ఈ కేసులో విచారణకు హాజరు కావాలని కోర్టు 2023లో రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. అనంతరం ఆయన కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. కేసు విచారణలో భాగంగా ఫిర్యాదుదారు రాహుల్ గాంధీ ప్రసంగానికి సంబంధించిన వాయిస్ రికార్డుతో ఆయన స్వర నమూనాను పోల్చాలని కోరారు. అయితే, ట్రయల్ కోర్టు ఆ అభ్యర్థనను తిరస్కరించింది. దీనిపై దాఖలైన విచారణ పిటిషన్‌ను సెషన్స్ కోర్టు కూడా కొట్టివేసింది. అనంతరం అలహాబాద్ హైకోర్టులోనూ ఈ నిర్ణయాలను సవాలు చేయగా, అక్కడ కూడా ఫిర్యాదుదారుకు అనుకూలంగా తీర్పు రాలేదు. ఇరుపక్షాల వాదనలు పూర్తయిన తర్వాత కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తొలుత అక్టోబర్ 13న తీర్పు వెలువరించాలని నిర్ణయించినప్పటికీ, అనంతరం అక్టోబర్ 26కు వాయిదా వేసింది.

కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ..

తీర్పు వెలువడనున్న నేపథ్యంలో రాహుల్ గాంధీ సోమవారం ఉదయం లక్నోకు చేరుకుని అక్కడి నుంచి సుల్తాన్‌పూర్‌కు వెళ్లారు. ఆయన రాక నేపథ్యంలో కోర్టు పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభమ్ వర్మ తీర్పు వెలువరించారు. తాజా తీర్పుతో 2018లో నమోదైన ఈ క్రిమినల్ పరువు నష్టం కేసులో రాహుల్ గాంధీపై విచారణ ముగిసింది. అమిత్ షాపై వ్యాఖ్యలకు సంబంధించిన ఈ కేసులో రాహుల్ గాంధీ నిర్దోషిగా విడుదల కావడం న్యాయపరమైన ఊరట లభించింది.

## రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఎంపీ గురుమూర్తి లేఖ

ఢిల్లీ : ఏపీ రాష్ట్ర ఎన్నికల సంఘం వైఫల్యాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్‌లకు వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని లేఖలో పేర్కొన్నారు. ఏపీ స్థానిక ఎన్నికల్లో అక్రమలు, హింస, నామినేషన్ అడ్డగింతలపై లేఖ ద్వారా వివరించారు. 'అన్నమయ్య, కడప, చిత్తూరు, తిరుపతి తదితర జిల్లాల్లో ప్రతిపక్ష అభ్యర్థులపై దాడులు, బెదిరింపులకు దిగారు. పుంగనూరులో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిపై దాడి.. వాహనాలు ధ్వంసం, నిప్పంటించడం వంటివి జరిగాయి. 222 వార్డుల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. కడపలో 66 వార్డులకు 11, మైదుకూరులో 32కు 4, రాజంపేటలో 32కు 7 నామినేషన్లు మాత్రమే పడ్డాయి. 1,345 మంది అభ్యర్థులు నామినేషన్ సమయంలో అడ్డంకులు ఎదుర్కొన్నారు. పోలీసుల పక్షపాతం, ఎన్నికల సంఘం వైఖరిపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలి. కేంద్ర బలగాలు, విశ్రాంత న్యాయమూర్తి పర్యవేక్షణతో స్వేచ్ఛాయుత ఎన్నికలు జరిగాలి' అని ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి చేశారు.

## ఎస్సై ప్రియాంకపై గుంటూరు ఎస్పీకి విడదల రజని ఫిర్యాదు



అమరావతి,: మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు విడదల రజని చిలకలూరిపేటలో జరిగిన పరిణామాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో అనుచితంగా ప్రవర్తించి, కిందకు తోసివేసిన ఎస్సై ప్రియాంకపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె గుంటూరు జిల్లా ఎస్పీ జగదీశ్‌కు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఎస్ఐపై సరైన చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఎస్పీని కలిసిన అనంతరం విడదల రజని మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధమైన పాలన జరగడం లేదని, కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం మాత్రమే అమలవుతోందని ఆరోపించారు. పోలీసులు చట్టాన్ని కాపాడాల్సింది పోయి, అధికార పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని విమర్శించారు. చిలకలూరిపేటలో తమ పార్టీ అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తూ, కిడ్నాప్‌లు చేసి నామినేషన్లు ఉపసంహరించుకునేలా ఒత్తిడి చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఇలాంటి బెదిరింపులకు భయపడబోమని, ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలు సరికాదని అన్నారు.

## అవి ఏకగ్రీవాలు కాదు..

## కూటమి పార్టీలు చేసిన బలాత్కారాలు: షర్మిల



మొదటి పేజి తరువాయి

అధికార కూటమి అరాచకాలకు ఈ ఏకగ్రీవాలు నిదర్శనమని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని తీవ్రంగా విమర్శించారు. షర్మిల తన ప్రకటనలో, "రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను 'కూటమి కమిషన్'గా మార్చారు. నడిరోడ్డుపై రాజ్యాంగాన్ని ఖూనీ చేసి, పోలీసు వ్యవస్థను బానిసగా మార్చి, ప్రతిపక్ష అభ్యర్థుల పత్రాలు చించివేసి, వారిని భయభ్రాంతులకు గురిచేశారు. రక్తపాతంతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన ఘనత కూటమి పార్టీలది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 16 మున్సిపాలిటీలు, 639 వార్డులు, 4 జెడ్పీటీసీలు, 32 ఎంపీటీసీ స్థానాల్లో జరిగినవి ఏకగ్రీవాలు కాదని, కూటమి సృష్టించిన భయోత్పాతానికి నిదర్శనాలని ఆమె అన్నారు. ఇది ప్రభంజనం కాదని, కూటమి రాజకీయ నిస్తేజమని అభివర్ణించారు. గత వైసీపీ ప్రభుత్వంతో పోలుస్తూ షర్మిల, కూటమి ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. "ఆనాడు వైసీపీ చేసిందని నేడు మీరు చేస్తారా? వాళ్లు గడ్డి తిన్నారని, మీరు అదే తింటారా? కూటమి ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదా? బలవంతపు ఏకగ్రీవాల పేరుతో ఈ విచక్షణా రాహిత్యం ఎందుకు?" అని ఆమె ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ బలవంతపు ఏకగ్రీవాలపై రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన షర్మిల డిమాండ్ చేశారు. ఏకగ్రీవాల ఫలితాలను నిలిపివేసి, పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల హక్కులను కాపాడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు..

## అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం: అచ్చెన్నాయుడు

మొదటి పేజి తరువాయి



అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ , విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.

### తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం 'అర్ణబ్' తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

### ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

### రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com
వికారాబాద్ జిల్లా
మంగళవారం - 27 - అక్టోబర్ - 2026

# శబరిమల యాత్రకు బయలుదేరిన అయ్యప్ప స్వాములకు శుభాకాంక్షలు

## – ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి





వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణం నుంచి శబరిమల అయ్యప్ప స్వామి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాములను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ టి.రామ్మోహన్ రెడ్డి ఆత్మీయంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు చేపట్టిన పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని,స్వామివారి దివ్య దర్శనాన్ని ప్రశాంతంగా చేసుకుని, ఎలాంటి ఆటంకాలు లేకుండా క్షేమంగా తిరిగి రావాలనిఆకాంక్షించారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

# సుంకరపాలెంలో జనసేన అభ్యర్థికి టీడీపీ మద్దతు

## కూటమి ధర్మం మేరకు కలిసి పనిచేయాలని నిర్ణయం



తాళ్లరేవు,మహి న్యూస్,అక్టోబర్ 26: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో జనసేన పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి మోపూరి లక్ష్మీదేవి విజయానికి సహకరించాలని టీడీపీ నాయకులు నిర్ణయించినట్లు జనసేన నాయకుడు మోపూరి శ్రీనివాస్ కిరణ్ తెలిపారు. సోమవారం టీడీపీ నాయకుడు చీకట్ల నాగేశ్వరరావు నివాసంలో చీకట్ల నాగేశ్వరరావు, తాతపూడి నాగేశ్వరరావు తదితరులను మోపూరి శ్రీనివాస్ కిరణ్ కలిశారు. ఈ సందర్భంగా జనసేన తరపున ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మోపూరి లక్ష్మీదేవికి మద్దతు ఇవ్వాలని, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలని కోరారు. కూటమి నిబంధనల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు ఆదేశాల మేరకు సుంకరపాలెం టీడీపీ నాయకులు జనసేన ఎంపీటీసీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కూటమి పార్టీల మధ్య సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగాలని నాయకులు భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

# తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్య

## – రేపు దేవస్థానం ఘాట్ రోడ్డు మూసివేత

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 26: ప్రస్తుతం బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావం కారణంగా రేపు అనగా మంగళవారం (27 అక్టోబర్ 2026) నగర పరిసరాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. వర్షాల సమయంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్త చర్యగా ఈరోజు (అక్టోబర్ 27) ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డును పూర్తిగా మూసివేస్తున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె. శీనానాయక్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఈవో వి.కె. శీనానాయక్ మాట్లాడుతూ.. క్షేత్రానికి విచ్చేసే భక్తులకు ఘాట్ రోడ్డు వైపు అనుమతి లేదని, శ్రీ అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తుల రాకపోకలకు మహామంటపం మార్గాన్ని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సేవలందిస్తారని, భక్తులందరూ ఈ మార్పును గమనించి ఆలయ భద్రతా సిబ్బందికి, అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మాచర్లలో ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రత్యేక కార్యక్రమం



మాచర్ల అక్టోబర్ 24:(మహి న్యూస్): కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి కొత్త ఓటర్ల నమోదు కోసం మాచర్ల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కృష్ణా--గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారి, పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి జారీ చేసిన ఆదేశాల మేరకు, నూతన ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మాచర్ల పట్టణంలోని చైతన్య పాఠశాల, నారాయణ పాఠశాలతో పాటు మాచర్ల గ్రామీణ ప్రాంతంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో అర్హులైన ఉపాధ్యాయుల నుంచి కొత్త ఓటర్ల నమోదుకు అవసరమైన వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల తహసీల్దార్ కిరణ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి పాల్గొని, అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నూతన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా అర్హులైన ప్రతి ఉపాధ్యాయుడికి ఓటు హక్కు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు స్వయంగా హాజరై నామినేషన్లు ఉపసంహరించుకోవాలి

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబరు 26: ప్రస్తుతం జరుగుతున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవాలనుకుంటే, రేపు (27.10.2026) మధ్యాహ్నం 3 గంటలలోపు సంబంధిత నామినేషన్ కేంద్రానికి స్వయంగా హాజరై ఉపసంహరణ పత్రాన్ని సమర్పించాలని అన్నమయ్య జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ లక్ష్మీపతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేసేందుకు అభ్యర్థులు నిర్ణీత గడువులోగా నేరుగా హాజరై సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఉపసంహరణ పత్రాన్ని అందజేయాలని సూచించారు. అభ్యర్థులు ఈ గడువును గమనించి, నామినేషన్ ఉపసంహరణకు సంబంధించిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని కోరారు.

# చిత్తూరు జిల్లాలో 27 జడ్పీటీసీ స్థానాలకు 162 నామినేషన్లు చెల్లుబాటు

## 370 ఎంపీటీసీ స్థానాలకు 1,491 నామినేషన్లు తుది జాబితాకు నమోదు

## – రేపు అభ్యర్థుల తుది జాబితా ప్రకటన

చిత్తూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పరిశీలన, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ అనంతరం అభ్యర్థుల వివరాలను అధికారులు వెల్లడించారు.

జడ్పీటీసీ: జిల్లాలో ఎన్నికలు జరగనున్న 27 జడ్పీటీసీ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 162 మంది అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటయ్యాయి. సోమవారం జడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జడ్పీటీసీ ఆర్వో రవికుమార్ నాయుడు నామినేషన్ ప్రక్రియను పరిశీలించి వివరాలను వెల్లడించారు.

ఎంపీటీసీ : జిల్లాలోని 27 మండలాల్లో 370 ఎంపీటీసీ ప్రాదేశిక నియోజకవర్గాలకు మొత్తం 1,788 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ అనంతరం 297 నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో 1,491 నామినేషన్లు తుది జాబితాలో ఖరారు చేయాల్సిన అభ్యర్థుల సంఖ్యగా నమోదయ్యాయి. అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. విడుదల చేసినవారు: డీడీ, సమాచార పౌర సంబంధాల శాఖ, చిత్తూరు

# రెండేళ్లలో వచ్చేది మన ప్రభుత్వమే: బొత్స



విజయనగరం: ముఖ్యమంత్రి చంద్రబాబు మాయమాటలు నమ్మి మోసపోవద్దని, రెండేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్పష్టం చేశారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ 31, 32,33,42 వార్డుల ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్న బొత్స మాట్లాడుతూ.. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌ను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేసింది వైఎస్సార్‌సీపీనేనన్నారు. వైఎస్సార్‌సీపీనే గెలిపిస్తేనే మరలా విజయనగరంలో అభివృద్ధి కనిపిస్తుందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలు ఇచ్చి, ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు.

# మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

## ఎన్నికల విధులను అధికారులు బాధ్యతగా నిర్వర్తించాలి

## పల్నాడు జిల్లాలో 156 వార్డులకు ఎన్నికలు

## 310 పోలింగ్ కేంద్రాల్లో 2,28,391 మంది ఓటర్లు

## సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత, వెబ్‌కాస్టింగ్‌కు చర్యలు



నరసరావుపేట, అక్టోబర్ 26: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ కన్నబాబు ఆదేశించారు. ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లపై సమీక్షించారు.

### 156 వార్డుల్లో ఎన్నికలు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల మాట్లాడుతూ వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల మున్సిపాలిటీల్లోని 156 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 117 పోలింగ్ లొకేషన్లలోని 310 పోలింగ్ కేంద్రాల్లో 2,28,391 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వెల్లడించారు. ఓటర్లకు ఫోటో ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఆహారం, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సిబ్బంది కేటాయింపులకు సంబంధించి మొదటి, రెండో ర్యాండమైజేషన్ పూర్తయిందని, అక్టోబర్ 30న మూడో ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యాలెట్ పత్రాల ముద్రణకు రెండు, మూడు ప్రింటింగ్ ప్రెస్‌లను గుర్తించి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమకు ఓటు హక్కు ఉన్న మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా ఓటు వేసేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

### సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక భద్రత

సున్నిత, అత్యంత సున్నిత పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించేందుకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని జనరల్ అబ్జర్వర్ కన్నబాబు సూచించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ మాట్లాడుతూ జిల్లాలోని 117 పోలింగ్ లొకేషన్లలో 29 అత్యంత సున్నిత, 52 సున్నిత, 36 సాధారణ లొకేషన్లను గుర్తించినట్లు తెలిపారు. అత్యంత సున్నిత లొకేషన్లలో ఐదుగురు, సున్నిత లొకేషన్లలో నలుగురు, సాధారణ లొకేషన్లలో ఇద్దరు పోలీసు



సిబ్బందిని నియమించనున్నట్లు వెల్లడించారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల, జిల్లా ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ భరణి ఐఎఫ్ఎస్, జిల్లా ఎస్పీ పి. జగదీష్, జాయింట్ కలెక్టర్ సంజన సింహ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల్లో శతాబ్దాల సూక్ష్మజీవులు...

## ఆధునిక జీవనశైలి ప్రభావం ఉన్నా చెంచులు, సవర్లలో మారని జీవక్రియలు.. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పరిశోధనలో వెల్లడి



హైదరాబాద్: ఆధునిక ప్రపంచంలో మనుషుల జీవనశైలి వేగంగా మారుతోంది. నగరాల్లోని ప్రజల ఆహార అలవాట్ల వల్ల పొట్టలో మేలు చేసే సూక్ష్మజీవుల (బ్యాక్టీరియా) స్వరూపమే మారిపోతోంది. కానీ మన గిరిజన తెగల ఆహారంలో స్వల్ప మార్పులు వస్తున్నా వారి శరీరంలోని రోగనిరోధక శక్తి, జీర్ణశక్తి శతాబ్దాల నాటి సంప్రదాయ పద్ధతుల్లోనే కొనసాగుతోందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల తాజా పరిశోధనలో తేలింది. ముఖ్యంగా చెంచులు, సవర తెగలకు చెందిన ప్రజల్లో ఈ జీర్ణకోశ శక్తులు ఇంకా పదిలంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రముఖ విజ్ఞాన శాస్త్ర పత్రిక బీఎంసీలో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి.

### ఏమిటీ పరిశోధన?

ఆంత్రోపోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు అన్వేష్ మైలే, హెచ్.ఎ. నాగరాజారాం, అలేఖ్య పొన్నాడ తదితరులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఇందుకోసం వారు 2023 నుంచి దాదాపు రెండేళ్లపాటు దేశవ్యాప్తంగా ఆరు గిరిజన తెగలకు చెందిన 18--45 ఏళ్ల వయసున్న 234 మంది ఆరోగ్యవంతులైన యువత శరీరంలోని జన్యువులను, పొట్టలోని జీవక్రియలను విశ్లేషించారు. ఈ అధ్యయనంలో మనుషుల జీర్ణవ్యవస్థలో ఆహారాన్ని అరిగించడానికి, రోగాల బారి నుంచి రక్షించడానికి మూడు ప్రధాన రకాల సూక్ష్మజీవుల సమూహాలు (ప్రొఫైల్స్) పనిచేస్తున్నట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. పరిశోధనలో భాగంగా చెంచు, సవర తెగలకు చెందిన మొత్తం 79 మందిని శాస్త్రవేత్తలు పరీక్షించగా ఏకంగా 65 మంది గిరిజనుల్లో ఇప్పటికీ పూర్తి సంప్రదాయక జీర్ణకోశ పద్ధతులే బలంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. కేవలం 14 మందిలో మాత్రమే ఆధునిక కాలపు పట్టణ సూక్ష్మజీవుల ఆనవాళ్లు కనిపించాయి. అయితే ఇక్కడే ఒక పెద్ద ఆశ్చర్యకరమైన విషయం వెలుగుచూసింది. ఆధునిక ప్రభావం పడి జీవనశైలి మారిన ఆ 14 మందిలోనూ పాతకాలపు ఆహారాన్ని అరిగించే శక్తులు, శరీరానికి కావాల్సిన ముఖ్యమైన విటమిన్లను సొంతంగా తయారు చేసుకొనే జన్యుపరమైన రక్షణ కవచాలు కొనసాగుతున్నాయి. అంటే వారి ఆహార అలవాట్లు మారుతున్నట్లు కనిపిస్తున్నా లోపల ఉన్న శారీరక వ్యవస్థ మూలాలు మాత్రం చెక్కుచెదరలేదు. నల్లమల అడవుల్లో నివసించే చెంచుల్లోని అధిక శాతం మందిలో సంప్రదాయ, ధాన్యాలను అరిగించే శక్తులే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అలాగే ఉత్తరాంధ్రలోని కొండ ప్రాంతాల్లో నివసించే సవర తెగల్లోనూ అత్యధికంగా ఈ శక్తులే కనిపించాయి.

### ప్రపంచానికే తెలియని కొత్త సూక్ష్మజీవులు..

ఈ పరిశోధన ద్వారా శాస్త్రవేత్తలు మానవ శరీరంలో నివసించే 1,616 రకాల సూక్ష్మజీవులను గుర్తించారు. అయితే ఇందులో అత్యంత విస్మయకరమైన విషయం ఏమిటంటే.. దాదాపు 813 రకాల బ్యాక్టీరియా ఏ జాతికి చెందినదో, దాని పేరేమిటో ఇప్పటివరకు ప్రపంచంలో ఉన్న ఏ డేటాబేస్‌లోనూ నమోదు కాలేదు. ప్రకృతితో ముడిపడిన గిరిజనుల జీవన విధానం, వారి శారీరక దృఢత్వాన్ని ఎలా కాపాడుతుందో ఈ పరిశోధన వెల్లడించింది. ఆధునిక వైద్య శాస్త్రానికి, భవిష్యత్తులో రాబోయే రోగాలకు మందులు కనుగొనడానికి మన గిరిజనుల జీవక్రియలు ఎంతో ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కేంద్ర సాయంపై స్పష్టత 'కరువు'

## తీవ్ర కరువు మండలాలకే ప్రాధాన్యం.. మధ్యస్థ కరువుపై నిధుల సందిగ్ధం

## కరువు కోరల్లో 358 మండలాలు.. కేంద్ర సాయం చిక్కులమయం.. వర్షపాత ప్రమాణాలు చేరని మండలాల ప్రతిపాదనపై ఉత్కంఠ

## ఈ నెల 31లోగా కేంద్రానికి నివేదిక



హైదరాబాద్: రాష్ట్రంలో కరువు పరిస్థితులు రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పత్తి దిగుబడులు పడిపోతుండగా, చివరి తడికి నీరు అందక వరి పొలాలు ఎండిపోతున్నాయి. మరోవైపు కరువు బాధిత రైతులకు అందే ఆర్థిక సాయంపై అనిశ్చితి నెలకొంది. రాష్ట్రంలో 358 మండలాలను ప్రాథమికంగా కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ప్రభుత్వం వీటికి సంబంధించి సమగ్ర నివేదికను ఈనెల 31లోగా కేంద్రానికి పంపేందుకు సిద్ధమువుతోంది. అయితే, కేంద్ర మార్గదర్శకాలు, కరువు తీవ్రత నిర్ధారణ, పంట నష్టం వివరాల ఆధారంగా ఎంతమేరకు ఆర్థిక సాయం అందుతుందన్నది కీలకంగా మారింది. ఇటీవల కరువు పరిస్థితులపై జరిగిన సమీక్షలో 358 మండలాలను ప్రాథమికంగా గుర్తించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాలు లోటు వర్షపాతం నమోదుకాగా, మరోవైపు 324 మండలాల్లో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోయాయి.

### తీవ్రత నిర్ధారణే కీలకం

కేంద్రానికి సమర్పించే నివేదికలో కరువు తీవ్రమతను నిర్ధారించేందుకు వర్షపాతం, సాగు విస్తీర్ణం, పంటల పరిస్థితి, నేలలో తేమ, భూగర్భ జలాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రం ప్రాథమికంగా గుర్తించిన మండలాలన్నింటికీ ఒకే స్థాయిలో ఆర్థిక సాయం అందుతుందని చెప్పలేని పరిస్థితి ఉంది. తీవ్ర కరువు నిర్ధారణతోపాటు కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా వివరాలు సమర్పించడం కీలకం. కేంద్రం నుంచి జాతీయ విపత్తు స్పందన నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్) కింద అదనపు సాయం కోరేందుకు రాష్ట్రం నిర్దేశిత విధానాన్ని అనుసరించాలి. సాధారణంగా తీవ్ర కరువు పరిస్థితుల్లో ఈ నిధి నుంచి సాయం కోరుతారు. అయితే, రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) సరిపోని పరిస్థితుల్లో మధ్యస్థ కరువుకూ కేంద్ర సాయం కోరే అవకాశం ఉంది. అందువల్ల మధ్యస్థ కరువు మండలాలకు కేంద్ర సాయం అందదని ముందుగానే నిర్ధారించలేం. రాష్ట్రం సముర్పించే నివేదిక, అందులోని ఆధారాలు, కేంద్ర పరిశీలనపై సాయం ఆధారపడి ఉంటుంది.

### వర్షపాతమే అడ్డంకిగా మారుతుందా?

కరువు అంచనాల్లో వర్షపాతంతోపాటు పంట నష్టం, సాగు విస్తీర్ణం, నేలలో తేమ వంటి ఇతర ప్రమాణాలకూ ప్రాధాన్యం ఉంది. వర్షపాత ప్రమాణాలను చేరుకోని మండలాల్లోనూ పంటలకు నష్టం జరిగి ఉండొచ్చు. అలాంటి ప్రాంతాలను అదనంగా ప్రతిపాదిస్తే, వాటికి సంబంధించిన క్షేత్రస్థాయి పరిశీలన, పంట నష్టం గణాంకాలు, ఇతర ఆధారాలను నివేదికలో స్పష్టంగా పొందుపరచాల్సి ఉంటుంది. రాష్ట్రం అదునంగా ప్రతిపాదించినట్లు చెబుతున్న 43 మండలాలకు సంబంధించి వర్షపాత ప్రమాణాలు, పంట నష్టం వివరాలు, జిల్లా వారీ సంఖ్యలపై అధికారిక నివేదిక అందుబాటులోకి రావాల్సి ఉంది. ఈ మండలాలను కేంద్రం ఆమోదిస్తుందా? లేదా? అన్నది ప్రస్తుతానికి స్పష్టత లేని అంశం. కేంద్రం ఆమోదించని పక్షంలో అక్కడి రైతులకు ఉపశమనం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కీలకం.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com

అనంతపురం జిల్లా - శ్రీ సత్యసాయి జిల్లా

మంగళవారం - 27 - అక్టోబర్ - 2026

## మహర్షి వాల్మీకి చిత్రపటానికి ఘన నివాళులు

**కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతోత్సవం**

**పూలమాలలు వేసి నివాళులర్పించిన**

**కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్**



అనంతపురం, అక్టోబర్ 26: (మహి న్యూస్): మహర్షి వాల్మీకి జయంతోత్సవం సందర్భంగా సోమవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మహర్షి వాల్మీకి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డీఆర్ఓ ఏ. మలోల పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓ. ఆనంద్ మాట్లాడుతూ మానవాళికి రామాయణం వంటి మహత్తర గ్రంథాన్ని అందించిన మహానుభావుడు మహర్షి వాల్మీకి అని పేర్కొన్నారు. ఆయన రచించిన రామాయణం అనేక సంవత్సరాలుగా మానవ జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోందని తెలిపారు. మహర్షి వాల్మీకి చూపినమార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు.



ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం, బీసీ వెల్ఫేర్ హెచ్‌డబ్ల్యూఓ మస్తాన్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతపురం నగరపాలక సంస్థలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం

**అక్టోబర్ 27 నుంచి 29 వరకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి అవకాశం**

**ప్రతిరోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రం ఏర్పాటు**

అనంతపురం, అక్టోబర్ 26: (మహి న్యూస్): రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు--2026లో భాగంగా ఎన్నికల విధులకు నియమించబడి, అనంతపురం పట్టణంలో ఓటు హక్కు కలిగిన అర్హులైన అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనంతపురం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అర్హులైన అధికారులు, సిబ్బంది అక్టోబర్ 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రాన్ని సందర్శించి ఓటు హక్కు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అవసరమైన గుర్తింపు పత్రాలు, ఎన్నికల విధుల కేటాయింపు పత్రాలను తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల విధులకు నియమించబడి, అనంతపురం పట్టణంలో ఓటు హక్కు కలిగిన అర్హులైన అధికారులు, సిబ్బంది ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు ఎన్నికల అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ కోరారు.

## రైతు బజార్లలో తక్కువ ధరలకు నాణ్యమైన బియ్యం విక్రయాలు

**కేఎన్ఎం బియ్యం కిలో రూ.50, బీపీటీ బియ్యం కిలో రూ.49**

**రేషన్ కార్డు లేదా ఆధార్‌తో గరిష్ఠంగా 26 కిలోల వరకు కొనుగోలు**

**ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు,**

**సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు విక్రయాలు**



అనంతపురం, అక్టోబర్ 26: (మహి న్యూస్): బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని రైతు బజార్ల ద్వారా కేఎన్ఎం (ఖరీఫ్), బీపీటీ (ర్బీ) రకాల బియ్యాన్ని తక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తెలిపారు. ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అక్టోబర్ 12 నుంచి బియ్యం విక్రయాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.50, బీపీటీ రకం బియ్యం కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రేషన్ కార్డుదారుడు లేదా ఆధార్ నంబరు కలిగిన వ్యక్తి గరిష్ఠంగా 26 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చని వెల్లడించారు. కొనుగోలుదారులు తమ రేషన్ కార్డు లేదా ఆధార్ నంబరును వెంట తీసుకురావాలని సూచించారు. పంపిణీ సక్రమంగా జరిగేలా తహశీల్దార్లు, పౌరసరఫరాల ఉప తహశీల్దార్లు పర్యవేక్షించాలని తెలిపారు.

### బియ్యం విక్రయ సమయాలు

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ౹ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జిల్లా ప్రజలు రైతు బజార్లలో అందుబాటులో ఉన్న ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ విజ్ఞప్తి చేశారు.

## వైసీపికి ఓటు అడిగే హక్కు లేదు



పెనుకొండ/శ్రీసత్యసాయి, మహి న్యూస్, అక్టోబర్ 26 : పెనుకొండ నియోజక వర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. నియోజక వర్గంలో రొద్దం మండలం తురకాలపట్నం గ్రామానికి చెందిన పలు ఎస్సీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారందరికీ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పసుపు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం రొద్ద మండలం తురకాలపట్నం గ్రామానికి చెందిన 12 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. వైసీపీ ఎస్సీ సెల్ నాయకులు పూజారిశంకర, పూజారి మారుతి ఆధ్వర్యంలో వారంతా టీడీపీలో చేరారు. మంత్రి సవిత వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రాన్ని జగన్ అధోగతి పాల్జేశారన్నారు. ఏ ఎన్నికలైనా ఓటు అడిగే హక్కు జగన్ కుగాని, గొడ్డలి పార్టీకి గాని లేదన్నారు. జగన్ అసమర్థ పాలన, నిర్ణయాలతో ప్రజలతో పాటు చివరికి వైసీపీ శ్రేణులు సైతం వేసిగి వేసారిపోయాయన్నారు. త్వరలో వైసీపీ నుంచి టీడీపీలోకి మరిన్ని చేరికలుంటాయని తెలిపారు. స్థానిక



సంస్థల ఎన్నికలతో రాష్ట్రంలో వైసీపీ ఉనికి గల్లంతవ్వడం ఖాయమన్నారు. పెనుకొండ నియోజక వర్గం సహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే విజయమని ధీమా వ్యక్తంచేశారు. పార్టీలోని చేరినవారంతా టీడీపీ, కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో అభివృద్ధిని మెచ్చి టీడీపీలో చేరుతున్నామన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మంత్రి సవిత నేతృత్వంలో పెనుకొండ నియోజక వర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు. రొద్దం మండలంలో మంత్రి సవిత దిశా నిర్దేశం మేరకు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో పూజారి శంకర, పూజారి విష్ణు, పూజారి మారుతి, పూజారి అర్జున్, హెచ్.అంజనప్ప, హెచ్.గంగాధర్, హెచ్.అంజి, పూజారి చక్రి, పెద్ద అంజి, గంగాధరప్ప కుటుంబాలతో పాటు జనసేనకు చెందిన పూజారి మారుతి కుటుంబంగా కూడా ఉంది.

## రాష్ట్రంలో రామరాజ్యం







పెనుకొండ/శ్రీసత్యసాయి, మహి న్యూస్, అక్టోబర్ 26 : వాల్మీకి మహర్షి స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రామరాజ్యం నడుస్తోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వాల్మీకీలు, బోయల రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు సీఎం చంద్రబాబునాయుడుతో సాధ్యమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వాల్మీకి, బోయలకు అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ టీడీపీ కార్యాలయంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి మంత్రి సవిత పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వాల్మీకి మహర్షి రచించిన రామాయణం చారిత్రాత్మకమైనదని, ప్రపంచ ప్రఖ్యాత కాంచిందని తెలిపారు. భార్యా భర్తల బంధానికి, అన్నా దమ్ముల అనుబంధానికి, కుటుంబా బాంధవ్యాలకు రామాయణం ఎంతో స్ఫూర్తినిస్తోందన్నారు. రామాయణంలో వాల్మీకి మహర్షి పేర్కొన్నవిధంగా ప్రస్తుతం రాష్ట్రంలో సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రామరాజ్యం నడుస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని జోరుగుర్రాల్లా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. బీసీల ఉన్నతికి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా బీసీలకు అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. బీసీల్లో భాగమైన వాల్మీకీలు, బోయలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ గుర్తింపునిచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. ఎందరో వాల్మీకి, బోయ నాయకులకు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, మంత్రులుగా అవకాశమిచ్చిన ఘనత అన్న ఎన్టీఆర్ ది, సీఎం చంద్రబాబుదేనన్నారు. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యమిచ్చామన్నారు. సోమందేపల్లి, గోరంట్ల ఎంపీపీ స్థానాలతో పాటు పలు ఎంపీటీసీ స్థానాలు, సర్పంచులుగా కేటాయించామన్నారు. పెనుకొండ నియోజక వర్గానికి చెందని వ్యక్తికి వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమించామన్నారు. వాల్మీకి, బోయల అభివృద్ధికి కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. 2017లో వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తూ సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని టీడీపీ జీవో జారీ చేసిందని మంత్రి సవిత గుర్తు చేశారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్ ను కూడా ఏర్పాటు చేసిన ఘనత సీఎం చంద్రబాబునాయుడిదేనన్నారు. పెనుకొండలో వాల్మీకి మహర్షి కాంస్య విగ్రహం ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ముగియగానే, వాల్మీకి విగ్రహం ఆవిష్కరించనున్నామన్నారు. బోయలు, వాల్మీకీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి కూటమి అభ్యర్థులకు వాల్మీకి, బోయ సామాజిక వర్గం అండగా నిలవాలని మంత్రి సవిత కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నరసింహ రావు, కార్పొరేషన్ డైరెక్టర్ డీవీ ఆంజనేయులు, భారీ సంఖ్యలో వాల్మీకి, బోయ సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

## గుంటూరు, తెనాలిలో నేడు, రేపు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

**గుంటూరులో ఏ.సి. కాలేజీ, తెనాలిలో మున్సిపల్ కౌన్సిల్ హాల్లో కేంద్రాలు**

**ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేసే అవకాశం**

**ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులు తప్పనిసరి**

గుంటూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అక్టోబర్ 27, 28 తేదీల్లో గుంటూరు, తెనాలిలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం సాయంత్రం ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల 27, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పించినట్లు తెలిపారు. గుంటూరులో ఏ.సి. కాలేజీలో, తెనాలిలో మున్సిపల్ కౌన్సిల్ హాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేసేందుకు వచ్చే సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులను తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. ఓటింగ్‌లో గోప్యత పాటించేలా ప్రత్యేక కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశామని, పూర్తి వీడియోగ్రఫీ నిర్వహించడంతో పాటు హెల్ప్ డెస్క్ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. పత్రాల ధ్రువీకరణ కోసం గెజిటెడ్ అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

**ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.**

### ఎన్నికల ఏర్పాట్లపై ఆదేశాలు

1. ఫోటో ఓటరు స్లిప్పుల పంపిణీని అక్టోబర్ 28 నాటికి పూర్తి చేసి, 29వ తేదీ నాటికి మార్క్‌డ్ కాపీలు సిద్ధం చేయాలి.
2. సున్నిత, అతి సున్నిత పోలింగ్ కేంద్రాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించాలి.
3. ప్రహరీ గోడలు లేని పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలి.
4. పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని, ఆ సమయానికి వచ్చిన ఓటర్లకు టోకెన్లు జారీ చేయాలి.
5. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి.
6. పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకాలు పూర్తి చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలి.
7. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల పరిధిలో ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.

## మాచర్లలో ఓటరు సౌకర్య కేంద్రం ఏర్పాటు

**ఈ నెల 28 నుంచి ఓటర్లకు అందుబాటులోకి.. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు**

మాచర్ల, అక్టోబరు 26:(మహి న్యూస్): మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు ప్రత్యేక సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ కేంద్రం అందుబాటులోకి రానుంది. మాచర్ల పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఓటర్లు ఎన్నికలకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు పురపాలక సంఘం కమిషనర్ కార్యాలయం నుంచి ఆదివారం ప్రకటన విడుదలైంది.

### ఓటర్లకు అవసరమైన సేవలు

ఎన్నికల సమయంలో ఓటర్లకు అవసరమైన సమాచారం సకాలంలో అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పురపాలక సంఘం వెల్లడించింది. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డుకు సంబంధించిన వివరాలు, ఎన్నికల జాబితాలో తమ పేరు నమోదైందా లేదా అనే సమాచారం, ఇతర ఎన్నికల సంబంధిత వివరాలను తెలుసుకునేందుకు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించి తమకు ఎదురయ్యే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కూడా ఈ కేంద్రం ఉపయోగపడనుంది.

### ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు

ఈ నెల 28వ తేదీ నుంచి మాచర్ల పురపాలక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సౌకర్య కేంద్రం ద్వారా సేవలు అందించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేంద్రం అందుబాటులో ఉంటుందని ప్రకటించారు. అవసరమైన సమాచారాన్ని పొందాలనుకునే ఓటర్లు నిర్ణీత వేళల్లో కేంద్రాన్ని సంప్రదించవచ్చని అధికారులు సూచించారు.

### ఎన్నికల సిబ్బందికి సహకారం

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి, సంబంధిత అధికారులకు అవసరమైన సహకారం అందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పురపాలక సంఘం పేర్కొంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లన్నింటినీ సమన్వయంతో చేపట్టాలని, విధులకు సంబంధించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించింది.

### ఓటర్లకు ఉపయోగకరం

ఎన్నికల సమయంలో ఓటర్లకు అవసరమైన సమాచారం అందుబాటులో ఉండటం ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో మాచర్లలో ఏర్పాటు చేసిన సౌకర్య కేంద్రం ఓటర్లకు ఉపయోగకరంగా మారనుంది. ఓటరు గుర్తింపు కార్డు వివరాలు, ఎన్నికల జాబితాలో పేరు నమోదుకు సంబంధించిన సమాచారం తెలుసుకోవాలనుకునే వారికి ఈ కేంద్రం ద్వారా సహాయం అందే అవకాశం ఉంది. ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంపొందించడంతో పాటు, ఓటర్లు తమకు అవసరమైన వివరాలను సులభంగా తెలుసుకునేందుకు ఈ ఏర్పాటు దోహదపడనుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు పురపాలక సంఘం చేపట్టిన ఈ చర్యతో ఓటర్లకు మరింత సౌలభ్యం కలగనుంది. ఓటర్లు నిర్ణీత సమయాల్లో సౌకర్య కేంద్రాన్ని సంప్రదించి తమకు అవసరమైన ఎన్నికల సమాచారాన్ని పొందవచ్చని అధికారులు తెలిపారు.

## నేటి రాజకీయాల్లో ఓటు హక్కు విలువ - ప్రజాస్వామ్యానికి పునాది

### అక్కయ్య బుట్టి

మాచర్ల అక్టోబర్ 26: (మహి న్యూస్): ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఓటు హక్కు కేవలం హక్కు మాత్రమే కాదు, అది ఒక బాధ్యత, ఆయుధం. నేటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఓటు ప్రాధాన్యతను, దాని ప్రభావాన్ని సమగ్రంగా విశ్లేషిస్తే...

### 1. ఓటు హక్కు ప్రాధాన్యత - ప్రజాస్వామ్యానికి గుండెకాయ

రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు ప్రతి పౌరుడికి తన భవిష్యత్తును తానే నిర్ణయించుకునే అవకాశం.

సమానత్వానికి ప్రతీక: కులం, మతం, ధనిక, పేద తేడా లేకుండా ప్రతి ఓటు విలువ ఒక్కటే. ౹ జవాబుదారీతనం: ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తమ తీర్పు ద్వారా పాలకులను ప్రశ్నిస్తారు. ఓటు వేయకపోతే ప్రశ్నించే నైతిక హక్కును కోల్పోయినట్లే. ౹ మార్పుకు మూలం: ఒకే ఒక్క ఓటు కూడా ప్రభుత్వాలను మార్చగలదు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో గత ఎన్నికల్లో చూసినట్లుగా, స్వల్ప ఓట్ల తేడాతోనే అభ్యర్థుల భవితవ్యం తారుమారవుతోంది.

### 2. రాజకీయ పార్టీలు, కార్యకర్తలు, నాయకుల మనోభావాలు

నేటి రాజకీయాల్లో ఓటు చుట్టూనే అన్ని వ్యూహాలు అల్లుకుంటున్నాయి.

పార్టీల దృక్పథం: ప్రతి పార్టీ ఓటును తమ సిద్ధాంతానికి, అభివృద్ధి నమూనాకు ఆమోదంగా భావిస్తోంది. అందుకే సంక్షేమ పథకాలు, అభివృద్ధి హామీలు, సామాజిక సమీకరణాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కార్యకర్తల మనోభావం: క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తకు ఓటు అనేది తన కష్టానికి ఫలితం. తాము ఇంటింటికి తిరిగి ప్రచారం చేసిన విధానం ఓటుగా మారినప్పుడు వారికి ఒక సంతృప్తి, భవిష్యత్తుపై ఆశ కలుగుతుంది. ఓటింగ్ శాతం తక్కువగా ఉంటే కార్యకర్తల్లో నిరాశ కనిపిస్తుంది. నాయకుల మనోభావం: నాయకులకు ప్రతి ఓటు తమ నాయకత్వంపై ప్రజలు పెట్టిన నమ్మకం. ఓటు శాతం పెరగడం, తమకు అనుకూలంగా రావడం వారికి మరింత బాధ్యతను పెంచుతుంది.

### 3. ఓటు వినియోగం - నేటి సవాలు

విచారకరమైన విషయం ఏమిటంటే, ఇంకా చాలా మంది ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు.



పట్టణ ప్రాంతాల్లో తక్కువ పోలింగ్: చదువుకున్న వర్గం, యువత ఓటు వేయడానికి ముందుకు రాకపోవడం ఆందోళనకరం.

ప్రలోభాల ప్రభావంలి: డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం వల్ల ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతింటుంది. 500 రూపాయలకు అమ్ముడుపోయే ఓటు,

5 ఏళ్ల భవిష్యత్తును అమ్ముకున్నట్లే అని మేధావులు హెచ్చరిస్తున్నారు.

సోషల్ మీడియా ప్రభావం: నేడు ఓటర్ల అభిప్రాయాన్ని మార్చడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. తప్పుడు వార్తలు కూడా ఓటు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తున్నాయి.

### 4. పార్టీ అభ్యర్థులపై ఓటు హక్కు ప్రభావం

ఓటు హక్కు అభ్యర్థి ఎంపిక నుండి గెలుపు వరకు ప్రతి దశలో ప్రభావం చూపుతుంది.

అభ్యర్థి ఎంపికలో: గెలిచే సత్తా ఉన్న, ప్రజల్లో ఆదరణ ఉన్న వ్యక్తికే టికెట్ ఇవ్వాలని పార్టీలు భావిస్తున్నాయి. స్థానికంగా మంచి పేరు, సేవా దృక్పథం ఉన్నవారికే ఇప్పుడు ప్రాధాన్యత పెరుగుతోంది. గెలుపోటముల్లో: ఇప్పుడు ఎన్నికలు వ్యక్తిగత ఇమేజ్ కంటే, పార్టీ విధానాలు ం అభ్యర్థి వ్యక్తిత్వం ం ప్రభుత్వ వ్యతిరేకత/అనుకూలత అనే మూడింటి కలయికగా మారాయి. ప్రజలు చాలా చైతన్యవంతులయ్యారు. కేవలం హామీలతో కాకుండా, చేసిన పనిని బట్టి ఓటు వేస్తున్నారు.

### 5. నేటి రాజకీయ పరిస్థితి - ఓటరుదే అంతిమ తీర్పు

నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పరిస్థితి చాలా ఆసక్తికరంగా ఉంది. అన్ని పార్టీలు సంక్షేమం, అభివృద్ధి, రాజధాని, ఉద్యోగాలు అనే అంశాల చుట్టూ తమ వ్యూహాలను రచిస్తున్నాయి. ఈ తరుణంలో ఓటరు మరింత అప్రమత్తంగా ఉండాలి.

### సందేశం

ఓటు వేయడం మన హక్కు కాదు, మన పిల్లల భవిష్యత్తుకు మనం ఇచ్చే భరోసా. ఏ పార్టీ అయినా, ఏ నాయకుడైనా - చివరికి నిర్ణేత ఓటరే.

ఓటు వేయండి - ప్రజాస్వామ్యాన్ని గెలిపించండి - మీ భవిష్యత్తును మీరే రాసుకోండి

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT.15-603/1, RAJU ROAD, KAMAL NAGAR, ANANTHAPURAMU, ANDHRA PRADESH - 515001.PRINTED AT VSAR PUBLICATIONS 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL.. RNI NO : APTEL/26/A7631. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# గుంటూరు, తెనాలిలో మద్యం దుకాణాలు బంద్

**అక్టోబర్ 30 సాయంత్రం 5 గంటల నుంచి మద్యం విక్రయాలు నిలిపివేత**

**నవంబర్ 1న పోలింగ్, నవంబర్ 3న ఓట్ల లెక్కింపు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ**




గుంటూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): గుంటూరు నగరపాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం పరిధిలో అక్టోబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి మద్యం విక్రయాలను నిలిపివేయనున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుంటూరు నగరపాలక సంస్థ, తెనాలి పురపాలక సంఘం పరిధిలో నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరగనున్నందున, నగరపాలక సంస్థల చట్టం--1955, రాష్ట్ర పురపాలక చట్టం--1965 నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 3వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నందున, కౌంటింగ్‌కు 48 గంటల ముందు నుంచి మద్యం విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎన్నికల నిబంధనలు, సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

## శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవంలో అన్నదానం, లక్కీడ్రా



మాచర్ల ( మహి న్యూస్ ) అక్టోబర్ 26 : పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని నెహ్రూ నగర్ బ్రిడ్జి సమీపంలో కొలువై ఉన్న శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం, లక్కీ డ్రా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల నియోజకవర్గ టీడీపీ నాయకులు యెనుముల కేశవరెడ్డి తనయుడు యెనుముల అర్జున్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన వారికి అర్జున్ రెడ్డి బహుమతులు అందజేశారు. అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షిస్తూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానికులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలు భక్తి వాతావరణంలో కొనసాగాయి.

# మైక్రో పరిశీలకుల పాత్ర కీలకం

**పోలింగ్ కేంద్రాల్లో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి**

**ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమావళిని పాటించాలి**




గుంటూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): ఎన్నికల్లో మైక్రో పరిశీలకుల పాత్ర కీలకమని సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో మైక్రో పరిశీలకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియా పాల్గొన్నారు.

**ఈ సందర్భంగా వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో మైక్రో పరిశీలకులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.**

– పోలింగ్ గదిలో జరిగే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల ఏజెంట్ల వివరాలను పక్కాగా నమోదు చేయాలి. – పోలింగ్ కేంద్రంలోకి అనధికార వ్యక్తులు ప్రవేశిస్తున్నారా లేదా గమనించి నివేదికలో పొందుపరచాలి. – ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ సిరా గుర్తు వేస్తున్నారా లేదా పరిశీలించాలి. – పోలింగ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి. – బ్యాలెట్ బాక్స్ సీలింగ్ ప్రక్రియను ఏజెంట్లకు వివరించాలి. ఒక సమయంలో ఒకే ఏజెంట్ ఉండేలా చూడాలి. – పోస్టల్ బ్యాలెట్ జారీ చేసిన వ్యక్తులు తిరిగి ఓటు వేయడానికి వస్తున్నారా లేదా గమనించాలి. – ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వద్ద ఓటు రహస్యాన్ని కచ్చితంగా కాపాడాలి. పోలింగ్ సిబ్బంది కూడా రహస్యతను పాటించాలి. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు మైక్రో పరిశీలకులు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు. వ్యయ పరిశీలకులు నందిని సలారియా మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమావళికి అనుగుణంగా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి పాల్గొన్నారు.



## దుర్గి ప్రధాన కూడలిలో వాహన తనిఖీలు..

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల నిఘా



దుర్గి అక్టోబర్ 26:(మహి న్యూస్): రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా దుర్గి ప్రధాన కూడలి (మెయిన్ సెంటర్)లో ఎస్సై బి. గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు చలాన్లు విధించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై బి. గోపాల్ వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాల సమయంలో తలకు తీవ్ర గాయాలు కాకుండా ప్రాణాలను కాపాడుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యల వల్ల ప్రాణాపాయ ప్రమాదాలు సంభవించే అవకాశముందని హెచ్చరించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని పేర్కొన్న ఎస్సై బి. గోపాల్, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మాచర్లలో బీరువా గుర్తుకు జోరుగా ప్రచారం



మహి న్యూస్ మాచర్ల అక్టోబర్ 26 : పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా 30, 31, 32, 33వ వార్డుల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బీరువా గుర్తును ప్రజలకు చూపిస్తూ, తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థులు ఓటర్లను కోరుతున్నారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుస్తూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

# అర్నాబ్ తుఫాను నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**తుఫాను పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ**

**డివిజన్, మండల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు**

**ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఫోన్ నంబర్లు**

**జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**

గుంటూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): అర్నాబ్ తుఫాను నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. తుఫాను పరిస్థితులపై సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఆయన వివరాలు వెల్లడించారు. తుఫానును ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించినట్లు తెలిపారు. భారీ వర్షాలు, ఆకస్మిక వరదలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవడంతోపాటు, ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ 08632-234014 కు ప్రజలు సంప్రదించవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి రేయింబవళ్లు పర్యవేక్షణ చేపట్టినట్లు వివరించారు.

**కంట్రోల్ రూమ్ విధుల్లో ఉండే సిబ్బంది వివరాలు:**

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు: వి. శ్రీనివాసరెడ్డి -- 9966990479, సి.హెచ్. శ్రీనివాసరావు -- 9290402095.

మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు: కె.ఎస్.ఎన్.ఆర్. ప్రసాద్ -- 9030046634, ఎన్. పుల్లారావు -- 9908593919.

రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు: కె. విజయ కార్తీక్ -- 8328434159, పి. ప్రణయ్ కుమార్ -- 9493347430.

తుఫాను పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

# స్కాబీస్ (గజ్జి), తామరపై అప్రమత్తత అవసరం!

## తొడల మధ్య తీవ్రమైన దురద, నల్లని మచ్చల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం – డాక్టర్ ఆర్. శ్రీనివాస్

రాజుపాలెం అక్టోబర్ 26:(మహి న్యూస్): తొడల మధ్య వచ్చే తీవ్రమైన దురద, గజ్జి, తామర వంటి చర్మ సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ సూచించారు. చాలామంది ఇలాంటి సమస్యలను ఇతరులకు చెప్పుకోవడానికి సిగ్గుపడి, వైద్యులను సంప్రదించకుండా మెడికల్ షాపుల్లో లభించే స్టెరాయిడ్లు కలిగిన క్రీములు, లోషన్లను సొంతంగా వాడుతున్నారని తెలిపారు. వీటివల్ల తాత్కాలికంగా దురద తగ్గినట్లు అనిపించినప్పటికీ, కొన్ని సందర్భాల్లో ఇన్ఫెక్షన్ తీవ్రత పెరిగి చర్మం పలుచబడటం, రంగు మారడం వంటి సమస్యలు తలెత్తవచ్చని హెచ్చరించారు. తొడల మధ్య భాగంలో వేడి, చెమట, తేమ ఎక్కువగా ఉండటం వల్ల శిలీంధ్ర సంబంధిత ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉందని వివరించారు. స్కాబీస్ (గజ్జి) అనేది సూక్ష్మ పరాన్నజీవుల వల్ల వచ్చే అంటువ్యాధి కాగా, తామర వంటి సమస్యలు శిలీంధ్రాల వల్ల కూడా రావచ్చని తెలిపారు. తీవ్రమైన దురదతో పదేపదే గోకడం వల్ల చర్మం దెబ్బతిని, కాలక్రమేణా నల్లని మచ్చలు, గట్టిపడిన చర్మం ఏర్పడవచ్చని పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని తెలిపారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తొడల మధ్య చర్మ ఇన్ఫెక్షన్లను నియంత్రించడానికి మందులతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు.

**1. చర్మాన్ని పొడిగా ఉంచుకోవాలి:**

తొడల మధ్య భాగాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. స్నానం చేసిన తర్వాత మెత్తని, శుభ్రమైన తువ్వాలుతో తేమ లేకుండా జాగ్రత్తగా తుడుచుకోవాలి. తేమ ఎక్కువసేపు ఉండకుండా చూసుకోవాలి.

**2. దుస్తుల ఎంపికలో జాగ్రత్తలు:**

బిగుతుగా ఉండే జీన్స్, గాలి ఆడని సింథటిక్ దుస్తులకు దూరంగా ఉండాలి. చెమటను పీల్చుకునే, గాలి ఆడే కాటన్ లోదుస్తులు ధరించడం మంచిది. చెమటతో తడిసిన దుస్తులను ఎక్కువసేపు ధరించకుండా, అవసరమైనప్పుడు మార్చుకోవాలి.

**3. దుస్తులను శుభ్రంగా ఉంచుకోవాలి:**

లోదుస్తులు, తువ్వాళ్లు, పడక చాపలు, బెడ్‌షీట్లను క్రమం తప్పకుండా ఉతికి పూర్తిగా ఆరబెట్టాలి. సాధ్యమైనప్పుడు వస్త్రాలకు అనువైన వేడి నీటిని ఉపయోగించవచ్చు. అయితే ప్రతి సందర్భంలో మరుగుతున్న నీటితో ఉతకడం తప్పనిసరి కాదు. స్కాబీస్ నిర్ధారణ అయినప్పుడు దుస్తులు, పరుపులు, తువ్వాళ్లను వైద్యుల సూచనల ప్రకారం శుభ్రం చేయాలి.

**4. దురద ఉన్న ప్రాంతాన్ని గోకకూడదు:**

దురదగా ఉన్నప్పుడు గోళ్లతో గిచ్చడం, గట్టిగా రుద్దడం చేయకూడదు. దీనివల్ల చర్మంపై గాయాలు ఏర్పడి, ద్వితీయ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాగే చర్మంపై నల్లని మచ్చలు మరింత స్పష్టంగా కనిపించవచ్చు.

**5. వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోవద్దు:**

తువ్వాళ్లు, లోదుస్తులు, దుస్తులు వంటి వ్యక్తిగత వస్తువులను ఇతరులతో పంచుకోకూడదు. స్కాబీస్ ఉన్నప్పుడు సన్నిహిత చర్మసంపర్కం ద్వారా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. అందువల్ల వ్యాధి నిర్ధారణ అయినప్పుడు వైద్యుల సూచనలను పాటించడం అవసరం.

### మందులు, చికిత్స విషయంలో జాగ్రత్తలు

చర్మ సమస్యలకు కారణాన్ని గుర్తించిన తర్వాతే తగిన చికిత్స తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. గజ్జి, తామర రెండూ ఒకే రకమైన వ్యాధులు కావని, వాటికి చికిత్స కూడా వేర్వేరుగా ఉంటుందని తెలిపారు. అందువల్ల వైద్యుల సలహా లేకుండా క్రీములు, లోషన్లు లేదా ఇతర మందులను సొంతంగా వాడకూడదని పేర్కొన్నారు.

**నల్లని మచ్చల నివారణ:**

ఇన్ఫెక్షన్ తగ్గిన తర్వాత కూడా చర్మంపై నల్లని మచ్చలు కొంతకాలం కొనసాగవచ్చు. ముందుగా అసలు సమస్యకు సరైన చికిత్స తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. ఇన్ఫెక్షన్ తగ్గిన తర్వాత మిగిలిన మచ్చల కోసం కలబంద జెల్ లేదా కొబ్బరి నూనె వాడాలని భావిస్తే, ముందుగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. ఇవి నల్లని మచ్చలను పూర్తిగా తొలగిస్తాయని నిర్ధారిత ఆధారాలు లేవని గుర్తుంచుకోవాలి.

### ఆయుర్వేద ఔషధాల వినియోగం

వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, వ్యాధి తీవ్రతను బట్టి మందుల ఎంపిక, మోతాదు మారవచ్చని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కాబట్టి ఆయుర్వేద ఔషధాలను కూడా అర్హత కలిగిన వైద్యుని సలహా మేరకే తీసుకోవాలని సూచించారు.

**మహామంజిష్టాది కషాయం:**

చర్మ సంబంధిత సమస్యల కోసం ఆయుర్వేద వైద్యంలో ఉపయోగించే ఔషధాల్లో మహామంజిష్టాది కషాయం ఒకటి. అయితే గజ్జి లేదా శిలీంధ్ర ఇన్ఫెక్షన్లను నయం చేయడానికి దీనిని స్వయంగా వాడకూడదు. వ్యాధి స్వభావాన్ని బట్టి వైద్యుని సూచన తీసుకోవాలి.

**ఖదిరారిష్టం:**

చర్మ సంబంధిత సమస్యల కోసం ఆయుర్వేద వైద్యంలో ఖదిరారిష్టాన్ని ఉపయోగిస్తారు. అయితే తీవ్రమైన దురద, అలర్జీలు లేదా ఇన్ఫెక్షన్లకు ఇది తప్పనిసరిగా పరిష్కారమని భావించకూడదు. వైద్యుల సలహాతోనే వినియోగించాలి.

**గంధక రసాయనం:**

గజ్జి, తామర వంటి చర్మ సమస్యల కోసం ఆయుర్వేద వైద్యులు కొన్ని సందర్భాల్లో గంధక రసాయనాన్ని సూచించవచ్చు. అయితే వ్యాధి నిర్ధారణ లేకుండా ఈ ఔషధాన్ని సొంతంగా తీసుకోకూడదు.

**కైశోర గుగ్గులు:**

చర్మ సంబంధిత సమస్యల్లో ఆయుర్వేద వైద్యులు కొన్ని సందర్భాల్లో కైశోర గుగ్గులును సూచిస్తారు. అయితే ప్రతి రకమైన చర్మ ఇన్ఫెక్షన్‌కు ఇది సరైన చికిత్స అని చెప్పలేము. అర్హత కలిగిన వైద్యుని సూచన మేరకే వాడాలి.

### వేప నీటి స్నానం, సబ్బుల వినియోగం

స్నానం చేసే నీటిలో వేపాకులు వేసి మరిగించి చల్లార్చిన నీటిని ఉపయోగించాలని కొందరు సూచిస్తుంటారు. అయితే వేప నీటి స్నానం వల్ల గజ్జి లేదా శిలీంధ్ర ఇన్ఫెక్షన్లు పూర్తిగా తగ్గుతాయని, ఇతరులకు వ్యాపించకుండా ఆపవచ్చని నిర్ధారిత ఆధారాలు లేవు. చర్మానికి చికాకు కలిగించే పదార్థాలను ఉపయోగించకుండా జాగ్రత్తపడాలి. అలాగే ఎక్కువ సువాసనలు, చర్మానికి చికాకు కలిగించే రసాయనాలు ఉన్న సబ్బులకు బదులుగా తేలికపాటి, సున్నితమైన సబ్బులను ఉపయోగించడం మంచిది. వేప–తులసి సబ్బులు లేదా సున్నిపిండి అందరికీ సరిపోతాయని భావించకూడదు. ఏ పదార్థం వాడినా దురద, మంట లేదా ఎర్రదనం పెరిగితే వెంటనే ఆపి వైద్యులను సంప్రదించాలి.

### ఆహార నియమాలు, ఆరోగ్యకరమైన జీవనశై

చికిత్స సమయంలో సమతుల ఆహారం తీసుకోవాలని డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. వంకాయ, గోంగూర, మిరపకాయలు, చేపలు, మాంసాహారం లేదా పులుపు, కారం ఉన్న ఆహార పదార్థాలను అందరూ తప్పనిసరిగా మానేయాల్సిన అవసరం లేదని, ఏదైనా ఆహారం తీసుకున్నప్పుడు వ్యక్తిగతంగా దురద లేదా అలర్జీ పెరుగుతున్నట్లు గమనిస్తే వైద్యుల సలహా మేరకు ఆహార మార్పులు చేసుకోవాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం మంచిదని పేర్కొన్నారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం మానసిక ప్రశాంతతకు తోడ్పడతాయని, అయితే ఇవి చర్మ ఇన్ఫెక్షన్లకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని వివరించారు. ముఖ్య గమనిక: ఈ సమాచారం ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడానికి మాత్రమే. తీవ్రమైన దురద, వ్యాపిస్తున్న దద్దుర్లు, గాయాలు, చీము లేదా ఇతర అసాధారణ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. గజ్జి నిర్ధారణ అయితే రోగితో సన్నిహితంగా ఉండే కుటుంబ సభ్యులకు కూడా చికిత్స అవసరమా అనే విషయాన్ని వైద్యులు నిర్ణయిస్తారు. సరైన వ్యాధి నిర్ధారణ, తగిన చికిత్స, వ్యక్తిగత పరిశుభ్రతతో చర్మ సమస్యలను నియంత్రించవచ్చని డాక్టర్ ఆర్. శ్రీనివాస్ తెలిపారు.



డాక్టర్ ఆర్ శ్రీనివాస్
ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి

# అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో మంగళవారం విద్యాసంస్థలకు సెలవు

**అక్టోబర్ 27న పాఠశాలలు, కళాశాలలకు సెలవు**

**అంగన్వాడీ కేంద్రాలకు మూడు రోజులపాటు సెలవు**

**లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి**

**వాగులు, వంకలు, నదులు దాటవద్దు: కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ**

గుంటూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): అర్నాబ్ తుఫాన్ నేపథ్యంలో మంగళవారం, అక్టోబర్ 27న జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ సెలవు ప్రకటించారు. అంగన్వాడీ కేంద్రాలకు వరుసగా మూడు రోజులపాటు సెలవు ప్రకటించారు. తుఫాన్‌పై సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.



### తుఫాన్ ముందస్తు చర్యలు

1. ప్రకాశం బ్యారేజీ నీటి నిల్వలు, వాగుల ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించాలి. బలహీనంగా ఉన్న గట్లను గుర్తించి ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలి.
2. గుంటూరు నగరపాలక సంస్థతో పాటు ఇతర మున్సిపాలిటీల్లో కాలువల్లో పూడిక తొలగించాలి. గాలులకు కూలిపోయే ప్రమాదం ఉన్న చెట్లు, హోర్డింగులను ముందుగానే తొలగించాలి.
3. లోతట్టు ప్రాంతాలు, అండర్‌పాస్‌లలో నీరు నిల్వ ఉండకుండా అవసరమైన చోట్ల ఆయిల్ ఇంజిన్లను సిద్ధంగా ఉంచాలి.
4. తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా జనరేటర్లు సిద్ధంగా ఉంచాలి. నీరు కలుషితం కాకుండా పర్యవేక్షించాలి.
5. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలి రవాణాకు ఆటంకం కలగకుండా ట్రీ కట్టర్లు, పవర్ సాస్‌లను సిద్ధంగా ఉంచాలి. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలి.
6. పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలి. టెలికాం, మొబైల్ సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
7. ముంపు ప్రమాదం ఉన్న గ్రామాలు, ఆవాసాలను గుర్తించి ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించాలి. చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలి.
8. పునరావాస కేంద్రాల్లో ఆహార పంపిణీకి ఏర్పాట్లు చేయాలి. వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

### రైతులు, పశువుల విషయంలో అప్రమత్తత

తుఫాన్ ప్రభావంపై రైతులకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు అవసరమైన సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వాటికి తగిన ఆహారం అందేలా పశుసంవర్ధక శాఖ చర్యలు చేపట్టాలని సూచించారు.

### ఆసుపత్రుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ఆపరేషన్ థియేటర్లకు విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. అధిక ప్రమాదంలో ఉన్న గర్భిణీలను ముందుగానే ఆసుపత్రులకు తరలించాలని, వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.

### వాగులు, వంకలు, నదులు దాటవద్దు

తుఫాన్ కారణంగా నీటి ప్రవాహాలు పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు వాగులు, వంకలు, నదులను దాటవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. నీటి ప్రవాహాల వద్ద ఈత కొట్టడం, చేపలు పట్టడం, ఇతర పనుల కోసం వెళ్లడం చేయరాదని సూచించారు. ఈ విషయాన్ని గ్రామాల్లో దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రజలు, పశువుల ప్రాణనష్టం జరగకుండా, ఆస్తి నష్టం నివారించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT 1/702, BEHIND BHARAT PETROL PUMP, GUNTUR, A.P - 522001.PRINTED AT VSAR PUBLICATIONS178/1, ANJANEYA VAGU, KOTHAPETA,VIJAYAWADA (URBAN), N T R, A.P -520001. RNI NO : APTEL/26/A7632. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


# రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్

జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఘన స్వాగతం

ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, అధికారులు

రెండు రోజుల తిరుమల, తిరుపతి పర్యటనలో భాగంగా జిల్లాకు రాక



తిరుపతి, అక్టోబర్ 26: (మహి న్యూస్): భారత ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం తిరుమల, తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సిమ్స్ డైరెక్టర్ జగదీష్ తదితరులు ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం ఉప రాష్ట్రపతి రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.



# తిరుమలలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు టీటీడీ అధికారుల స్వాగతం

పద్మావతి అతిథిగృహం వద్ద పుష్పగుచ్ఛాలతో స్వాగతం

దర్శన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారుల వివరణ

తిరుమలలో ప్రత్యేక బందోబస్తు



తిరుమల, అక్టోబర్ 26: (మహి న్యూస్): శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు విచ్చేసిన భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు పద్మావతి అతిథిగృహం వద్ద టీటీడీ అధికారులు ఘన స్వాగతం పలికారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్‌ఓ, ఎస్పీ మురళీకృష్ణ తదితర అధికారులు ఉపరాష్ట్రపతికి





పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలను వివరించారు. ఉపరాష్ట్రపతి శ్రీవారి దర్శనానికి సంబంధించి టీటీడీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి భద్రతా సమస్యలు తలెత్తకుండా పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు. పర్యటన నేపథ్యంలో తిరుమలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

# మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన

కలెక్టర్ సుమిత్ కుమార్, ఎస్పీ తుషార్ డూడి

కౌంటింగ్ కేంద్రాల్లో మూడంచెల భద్రతకు చర్యలు

సిబ్బంది, ఏజెంట్లకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు



పలమనేరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): పలమనేరు మున్సిపాలిటీ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా



ఎస్పీ తుషార్ డూడి సోమవారం నగరంలోని పలు ఎన్నికల కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎస్‌వీసీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ సమయంలో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది, అధికారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పలమనేరు మున్సిపాలిటీకి సంబంధించి కళాశాలలోని రెండు సెమినార్ హాళ్లలో ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్రంలో మూడంచెల భద్రత కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, వీ.కోట మండలాలకు సంబంధించిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, రాకపోకలకు అనువైన మార్గాలు, పటిష్టమైన క్యూలైన్ల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భవాని తదితరులు పాల్గొన్నారు.



# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భారత ఉపరాష్ట్రపతి

ముందుగా శ్రీ వరాహస్వామిని దర్శించుకున్న ఉపరాష్ట్రపతి

ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికిన టీటీడీ ఈవో, అదనపు ఈవో

వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేసిన అర్చకులు



తిరుమల, అక్టోబర్ 26: (మహి న్యూస్): భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ సోమవారం సాయంత్రం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా శ్రీ వరాహస్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకున్న ఉపరాష్ట్రపతికి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, సీవీఎస్వో మురళీకృష్ణ స్వాగతం పలికారు. అర్చక బృందం ఆలయ సంప్రదాయం ప్రకారం ఇస్తికఫాల్ స్వాగతం అందించింది. ఉపరాష్ట్రపతి ధ్వజస్తంభానికి నమస్కరించి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ వకుళామాత, విమాన వేంకటేశ్వరస్వామి, భాష్యకార్ల సన్నిధి, యోగ నరసింహస్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. టీటీడీ ఈవో, అదనపు ఈవో ఉపరాష్ట్రపతికి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామివారిని కూడా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, టీటీడీ బోర్డు సభ్యులు రామ్మూర్తి, దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. విడుదల చేసినవారు: టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి



# మధ్యవర్తులు ఇరుపక్షాల పట్ల నిష్పాక్షికంగా వ్యవహరించాలి

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

తక్కువ ఖర్చుతో, సమయం ఆదా చేస్తూ

వివాదాల పరిష్కారం

మధ్యవర్తులు సమాచార గోప్యత, స్వచ్ఛంద

భాగస్వామ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

– జిల్లా జడ్జి అరుణ సారిక





చిత్తూరు, అక్టోబర్ 26: (మహి న్యూస్): మధ్యవర్తులు ఇరుపక్షాల పట్ల నిష్పాక్షికంగా వ్యవహరించాలని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డైరెక్టర్ అరుణ సారిక సూచించారు. సోమవారం



చిత్తూరు జిల్లా కోర్టులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మధ్యవర్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి స్వాగతం పలికారు. చిత్తూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. శంకర్ నాయుడు, ఢిల్లీకి చెందిన న్యాయవాది, వనరుల వ్యక్తి అనూజా సక్సేనా పాల్గొన్నారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి అరుణ సారిక మాట్లాడుతూ వివాదాలను పరిష్కరించడంతోపాటు పరస్పర సంభాషణ, అవగాహన, సహకారం ద్వారా సంబంధాలను కాపాడుకోవడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. న్యాయస్థానాలపై కేసుల భారాన్ని తగ్గించడంతోపాటు, తక్కువ ఖర్చుతో, సమయం ఆదా చేస్తూ ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాలను సాధించేందుకు మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని వివరించారు. శిక్షణ పొందిన మధ్యవర్తులు తమ జ్ఞానాన్ని పునరుద్ధరించుకోవడానికి, ఆచరణాత్మక నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి, మధ్యవర్తిత్వ సమావేశాల్లో ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తులు ఇరుపక్షాల పట్ల నిష్పాక్షికంగా వ్యవహరించాలని, వర్తించే చట్టాలకు అనుగుణంగా సమాచార గోప్యతను కాపాడాలని సూచించారు. మధ్యవర్తిత్వంలో పాల్గొనడం స్వచ్ఛందమనే అంశాన్ని గౌరవిస్తూ, ఇరుపక్షాల అభిప్రాయాలను ఓపికగా వినాలని తెలిపారు. ఏ పక్షంపైనా పరిష్కారాన్ని బలవంతంగా రుద్దకుండా, నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను వారికే వదిలివేయాలని సూచించారు. న్యాయవాది అనూజా సక్సేనా మాట్లాడుతూ మధ్యవర్తులు తమ అనుభవాలను పంచుకోవడానికి, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, ఆచరణాత్మక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్. భారతి మాట్లాడుతూ న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువగా, అందరికీ అందుబాటులో ఉండేలా, ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు మధ్యవర్తిత్వ వ్యవస్థను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

# తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 టోల్‌ఫ్రీ నంబర్లు

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దు

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్

అమరావతి, అక్టోబర్ 26: (మహి న్యూస్): రాబోయే తుపాను ముప్పు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు. తుపాను సమయంలో, తుపానుకు ముందు, అనంతరం ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.




### తుపానుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

పుకార్లను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలి. అధికారిక హెచ్చరికలను గమనించాలి.

అత్యవసర సమాచారం కోసం మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసి ఉంచుకోవాలి. రేడియో, టీవీల ద్వారా తాజా సమాచారాన్ని తెలుసుకోవాలి.

విలువైన పత్రాలు, సర్టిఫికెట్లను వాటర్‌ప్రూఫ్ కవర్లలో భద్రపరుచుకోవాలి. అత్యవసర వస్తువులతో కూడిన కిట్ సిద్ధం చేసుకోవాలి.

కనీసం ఒక వారానికి సరిపడా ఆహారం, తాగునీటిని నిల్వ ఉంచుకోవాలి.

వరదలు, ఉప్పెన ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అధికారులు సూచించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలి.

### తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ఇంట్లో ఉంటే తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి. పరిస్థితిని బట్టి విద్యుత్ సరఫరా, గ్యాస్ కనెక్షన్ల విషయంలో సురక్షిత చర్యలు తీసుకోవాలి.

ఇల్లు సురక్షితంగా లేనప్పుడు ముందుగానే సురక్షిత ఆశ్రయానికి వెళ్లాలి.

కాచి చల్లార్చిన లేదా శుద్ధి చేసిన నీటినే తాగాలి.

బయట ఉన్నప్పుడు చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడకూడదు. దెబ్బతిన్న భవనాల్లోకి వెళ్లకూడదు.

గాలి తగ్గినప్పటికీ తుపాను ముగిసిందని భావించకూడదు. అధికారులు అధికారికంగా ప్రమాదం తొలగినట్లు ప్రకటించే వరకు అప్రమత్తంగా ఉండాలి.

### తుపాను అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలు:

అధికారులు సూచించే వరకు సురక్షిత ఆశ్రయాలను విడిచిపెట్టకూడదు.

తెగిపడిన విద్యుత్ తీగలు, విరిగిన విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలి.

దెబ్బతిన్న విద్యుత్ పరికరాలను ఎలక్ట్రీషియన్ తనిఖీ చేసిన తర్వాతే వినియోగించాలి.

తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి.

### మత్స్యకారులకు సూచనలు:

మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేసి ఉంచుకోవాలని, అదనపు బ్యాటరీలతో రేడియోను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపింది. పడవలు, తెప్పలను సురక్షిత ప్రాంతాల్లో బలమైన తాళ్లతో కట్టి ఉంచాలని సూచించింది. అత్యవసర సహాయం కోసం ప్రజలు రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం (ఎస్ఈఓసీ) టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101 ను సంప్రదించాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

# తిరుపతి ప్రాంతీయ సదస్సులో రూ.11,731 కోట్ల పెట్టుబడులు

67 అవగాహన ఒప్పందాలు..

20,879 మందికి ఉపాధి అవకాశాలు

ఐదు ప్రాంతీయ సదస్సుల్లో రూ.85,561 కోట్ల పెట్టుబడులు

ఒక కుటుంబం – ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో

ఎంఎస్‌ఎంఈలకు ప్రోత్సాహం

ఎంఎస్‌ఎంఈ బ్యాంకింగ్ గ్రీవెన్స్ రిడ్రెసల్ మెకానిజం పోర్టల్ ఆవిష్కరణ



శ్రీసిటీ, అక్టోబర్ 26: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సులు విజయవంతంగా ముగిశాయని రాష్ట్ర యువజన అడ్వాన్స్‌మెంట్, పర్యాటకం, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ తెలిపారు. శ్రీసిటీలోని క్రియా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన తిరుపతి ప్రాంతీయ సదస్సులో రూ.11,731.68 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 67 అవగాహన ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 20,879 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా. వై. యువరాజ్, ప్రాసెసింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఏపీ ఎకనామిక్



డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ సగిలి షన్మోహన్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ శుభమ్ బన్సల్, ఏపీఐఐసీ అధికారులు, శ్రీ సిటీ చైర్మన్ సి. శ్రీనివాస రాజు, మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. రావత్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పారిశ్రామిక పెట్టుబడులను విస్తరించడం, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవడం, ఎంఎస్‌ఎంఈలను ప్రోత్సహించడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచవచ్చన్నారు. శ్రీసిటీ, శ్రీకాళహస్తి ప్రాంతాలకు పారిశ్రామికంగా విశేష ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. సదస్సులో భాగంగా ఎంఎస్‌ఎంఈ బ్యాంకింగ్ గ్రీవెన్స్ రిడ్రెసల్ మెకానిజం పోర్టల్‌ను ఆవిష్కరించారు. విశాఖపట్నంలో నవంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా. వై. యువరాజ్ మాట్లాడుతూ "ఒక కుటుంబం -- ఒక పారిశ్రామికవేత్త" లక్ష్యంతో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని 175 పార్కుల్లో 153 పార్కుల పనులు పురోగతిలో ఉన్నాయని, తిరుపతి సహా ఐదు జిల్లాల్లో 31 ఎంఎస్‌ఎంఈ పార్కులు ఉండగా, సుమారు 2,053 ఎకరాల భూమి అందుబాటులో ఉందన్నారు. జూన్ 2024 నుంచి ఈ ప్రాంతంలో 914 ఎకరాల భూమిని ఎంఎస్‌ఎంఈలకు కేటాయించగా, రూ.3,885 కోట్ల పెట్టుబడులు, 41,622 ఉద్యోగాల కల్పనకు అవకాశాలు ఏర్పడ్డాయని వివరించారు. సదస్సులో వివిధ రంగాలకు సంబంధించిన పెట్టుబడి అవకాశాలు, స్థానిక పరిశ్రమల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో టమోటా, మామిడి ఉత్పత్తులు, పాల ఉత్పత్తులు, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్ యూనిట్ల ఏర్పాటుకు అవకాశాలున్నాయని కెవిన్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆముదవల్లి రంగనాథన్ తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా వ్యవసాయ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. శ్రీసిటీలో తమ సంస్థ అభివృద్ధి గురించి ఇండియా మెటల్ వన్ స్టీల్ ప్లేట్ ప్రాసెసింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ టైజో ఇవామి వివరించారు. తమ సంస్థ పెట్టుబడులు రూ.20 కోట్ల నుంచి రూ.400 కోట్లకు పెరిగాయని, ఉద్యోగుల సంఖ్య 130 నుంచి 800కు చేరిందన్నారు. మార్చి 2027 నాటికి 1,000 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు అవకాశాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్ డా. జి. సాంబశివరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఆటోమోటివ్, పర్యాటకం, ఆతిథ్యం, పాదరక్షల తయారీ, ఆహార శుద్ధి, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. పరిశ్రమలు, ప్రభుత్వం, స్థానిక పారిశ్రామికవేత్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్రియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నిర్మలా రావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వ శాఖ జాయింట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సందీప్ దావు మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎదుర్కొంటున్న ఆలస్య చెల్లింపులు, పెట్టుబడుల కొరత వంటి సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. తిరుపతి ప్రాంతీయ సదస్సులో ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల రంగంలో ఆరు ఒప్పందాల ద్వారా రూ.2,105 కోట్ల పెట్టుబడులు, 4,540 ఉద్యోగాలు; ఆటో విడిభాగాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో ఐదు ఒప్పందాల ద్వారా రూ.1,600 కోట్ల పెట్టుబడులు, 2,250 ఉద్యోగాలు; పాదరక్షల తయారీలో రూ.700 కోట్ల పెట్టుబడితో 3,000 ఉద్యోగాలు కల్పించే అవకాశాలున్నాయి. పర్యాటక, ఆతిథ్య రంగాల్లో 22 ఒప్పందాల ద్వారా రూ.1,538 కోట్ల పెట్టుబడులు, 2,812 ఉద్యోగాలు, ఆహార శుద్ధి రంగంలో తొమ్మిది ఒప్పందాల ద్వారా రూ.1,096 కోట్ల పెట్టుబడులు, 2,130 ఉద్యోగాల కల్పనకు అవకాశముంది. తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలకు చెందిన 21 ఎంఎస్‌ఎంఈ సంస్థలు తమ ఉత్పత్తులను




ప్రదర్శించాయి. ప్యాకేజింగ్, పారిశ్రామిక పరికరాలు, ఆటోమేషన్, రోబోటిక్స్, వ్యవసాయ ఉత్పత్తులు, చిరుధాన్యాలు, హస్తకళలు, గ్రామీణ పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 2024 నుంచి రూ.22.6 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టులు ప్రతిపాదనల దశలో ఉన్నాయని, వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటిలో 496 ప్రాజెక్టులకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కాగా, రూ.5.9 లక్షల కోట్ల విలువైన 267 ప్రాజెక్టులు ఇప్పటికే కార్యరూపం దాల్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు రాష్ట్రంలోని పారిశ్రామిక పెట్టుబడుల అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాలకు పరిచయం చేయడంలో కీలకంగా నిలిచింది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED 9147/1, SRI LAKSHMI NARASIMHA YOGIMAILAVARAM ARCH ROAD, YOGIMAILAVARAM,TIRUPATHI,AP - 517503.A.P .VSAR PUBLICATIONSDOOR NO. 403, PANTA STREET, TIRUPATHI - 517501.RNI NO : APTEL/26/A5325. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

# కౌంటింగ్ కేంద్రం ఏర్పాట్లు చురుగ్గా పూర్తి

**పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం ఏర్పాట్ల పరిశీలన**

**ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపునకు సన్నాహాలు**

**అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల నిర్వహణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. సోమవారం నగర శివార్లలోని అథెనా స్కూల్ ప్రాంగణంలో అధికారులతో కలిసి ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. అథెనా స్కూల్ మైదానంలో పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాన్ని, స్పోర్ట్స్ బిల్డింగ్‌లోని ఇండోర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా కొత్త రహదారిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సుల భద్రతకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తుతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు గదుల్లో అవసరమైన సదుపాయాలు దాదాపు పూర్తి అయ్యాయని, కౌంటింగ్ కేంద్రం సమీపంలో పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లు సిద్ధం చేస్తామని చల్లా ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, ఏఈలు జనార్ధన్, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకోవాలి

**రేపు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఫెసిలిటేషన్ సెంటర్**

**దామోదరం సంజీవయ్య మెమోరియల్ పాఠశాలలో కేంద్రం ఏర్పాటు**

**పోలింగ్, పోలీసు సిబ్బందికి ఓటు వేసే అవకాశం – కమిషనర్ చల్లా ఓబులేసు**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కర్నూలు నగరపాలక సంస్థ ఓటరు జాబితాలో పేరుండి, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వహించే అర్హులైన ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. సోమవారం నగరంలోని పాత కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న దామోదరం సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేయనున్న ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫెసిలిటేషన్ సెంటర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.



ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చే సిబ్బంది కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేరుకు సంబంధించిన వివరాలు, ఎన్నికల విధులు కేటాయించినట్లు సంబంధిత అధికారులు జారీ చేసిన ఉత్తర్వులను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రంలో గెజిటెడ్ అధికారుల ద్వారా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం అర్హులైన సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు.



ఎన్నికల విధుల్లో పాల్గొనే అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత సమయంలో కేంద్రానికి చేరుకుని, అవసరమైన పత్రాలతో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చల్లా ఓబులేసు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, డీఈఈ కృష్ణలత, టీపీఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి నిర్మూలనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

**అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత**

**యువత, విద్యావంతులు కీలక పాత్ర పోషించాలి**

**అవినీతి నిరోధక 1064 పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ జి. రాజకుమారి**



నంద్యాల, అక్టోబర్ 26: (మహి న్యూస్): అవినీతి రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, సమాజాభివృద్ధికి అడ్డంకిగా ఉన్న అవినీతి నిర్మూలనలో యువత, విద్యావంతులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిలుపునిచ్చారు. అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అవినీతి నిరోధక టోల్‌ఫ్రీ నంబర్ 1064 పోస్టర్లను ఆవిష్కరించారు.




ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో అవినీతి నిరోధక చైతన్యం పెంపొందించి, పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అక్టోబర్ 26 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పోస్టర్ల ప్రదర్శన, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీలు, విజిలెన్స్ అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.



అక్టోబర్ 30న టోల్‌ఫ్రీ నంబర్ 1064పై ఎఫ్ఎం రేడియో ద్వారా ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 31న మండల కేంద్రాల్లో ప్రజలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ సీఐ రామాంజనేయులు, ఎస్ఐ సుబ్బరాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

**వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణ మోహన్**

**రామాయణం ద్వారా సమాజానికి అందించిన ధర్మం, నీతి, సత్యం వంటి విలువలను స్మరించుకున్న పోలీసులు**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ కృష్ణ మోహన్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి జీవితాన్ని, ఆయన రచించిన రామాయణం ద్వారా సమాజానికి అందించిన ధర్మం, నీతి, సత్యం వంటి విలువలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నారాయణ, ఆర్ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలి**

**మౌలిక సదుపాయాలు, పార్కింగ్, సూచిక బోర్డులు సిద్ధం చేయాలి**

**అధికారులకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు**

కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపును ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్ట భద్రతా



ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. సోమవారం పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆదోని మండలం విరుపాపురం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన



స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ హాళ్లలో టేబుళ్ల ఏర్పాటు, సిబ్బంది రాకపోకలకు మార్గాలు, ప్రవేశ ద్వారాల వద్ద బారికేడింగ్, లైటింగ్, విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్ సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లు, భవనాల ముందు, వెనుక భాగాలు, ప్రవేశ ద్వారాలు, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజీని నిరంతరం పర్యవేక్షించేందుకు మానిటర్లు, సాంకేతిక పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని, అవసరమైన చోట లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. సిబ్బందికి పార్కింగ్ సౌకర్యం కల్పించడంతో పాటు, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గాలు, రిసెప్షన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్ల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన సిబ్బందిని నియమించి, స్టాట్యూటరీ, నాన్-స్టాట్యూటరీ





కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని కేంద్రాల్లో పటిష్ట పోలీసు భద్రత కల్పిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వెనుక భాగాల్లో వెలుతురు కోసం ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని, అన్ని సీసీటీవీ కెమెరాల ఫుటేజీని ఒకేసారి పర్యవేక్షించేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఆదోని అదనపు ఎస్పీ జయ శర్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలు నగరంలో ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన – రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం, పోలింగ్ కేంద్రాల తనిఖీ**

**ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): కర్నూలు నగర పాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్ నగరంలోని ఎన్నికల కేంద్రాలను పరిశీలించారు. గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని అథీనా స్కూల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం, వెంకటరమణ కాలనీ వెనుక ఉన్న కేశవరెడ్డి స్కూల్, శ్రీజ స్కూల్ పోలింగ్ కేంద్రాలతో పాటు ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.



ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును



వినియోగించుకునేలా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత కొనసాగించాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో కర్నూలు తాలూకా సీఐ తేజమూర్తి పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఘన నివాళులు

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ**

**-ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను స్మరించుకున్న అధికారులు**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని సోమవారం కర్నూలు జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు



లర్పించారు. జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, కార్యాలయ పరిపాలన అధికారి రవి కుమార్ తదితరులు పూలు సమర్పించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను, సమాజానికి ఆయన అందించిన సందేశాలను స్మరించుకున్నారు. భారతీయ సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధి చెందిన వాల్మీకి రచించిన రామాయణం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రామాయణం ద్వారా ఆయన అందించిన ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలు సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని తెలిపారు. వాల్మీకి మహర్షి ఆశయాలను స్మరించుకుంటూ సమాజ అభ్యున్నతికి, నైతిక విలువల పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లూరు అర్బన్‌లో టీడీపీ రోడ్‌షో

**38వ వార్డు అభ్యర్థులు దాసరి శృతి, కే. నరసింహ బాబుకు మద్దతుగా ప్రచారం**

**మేయర్ అభ్యర్థి బొల్లేదుల ప్రత్యూషను గెలిపించాలని గౌరు చరిత రెడ్డి విజ్ఞప్తి**



కర్నూలు, అక్టోబర్ 26: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరు అర్బన్‌లో 38వ వార్డు అభ్యర్థి దాసరి శృతి, కే. నరసింహ బాబు, మేయర్ అభ్యర్థి బొల్లేదుల ప్రత్యూషకు మద్దతుగా పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరిత రెడ్డి వార్డుల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా సైకిల్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.కే. శ్రీనివాసరావు, ఎరుకలి కుమార్, వీరేంద్ర కుమార్, రామకృష్ణ, ఎరుకలి బబ్లూ, ఎరుకలి వంశీ, సర్దార్, కుమ్మరి శ్రీనివాసులు, లింగన్న, అబ్దుల్లా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నంద్యాలలో మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

**పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్ పరిశీలన**

**బ్యాలెట్ బాక్సుల పనితీరును తనిఖీ చేసిన జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి**

**ఓటర్లకు అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశం**




నంద్యాల, అక్టోబర్ 26: (మహి న్యూస్): మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ జె. వెంకట మురళి అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కౌంటర్, డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ను ఆయన పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని, స్ట్రాంగ్ రూమ్‌లో ఎన్నికల సామగ్రి భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లను తనిఖీ చేశారు.





ఓటర్లు సౌకర్యవంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పోలింగ్‌లో వినియోగించే బ్యాలెట్ బాక్సుల పనితీరును పరిశీలించి, వాటి వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో క్రమబద్ధమైన ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రి భద్రత, సిబ్బందికి సౌకర్యాలు, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, నోడల్ అధికారి శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు



శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 26 : లోక కల్యాణార్థం పంచమఠాలలో నిన్న ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా నిన్న జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి. కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001, A.P
PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

## "పిల్లల కోసం న్యాయ సేవా విభాగం మరియు మానసిక అనారోగ్యం మరియు మేధోపరమైన వైకల్యాలు ఉన్న వ్యక్తుల కోసం న్యాయ సేవా విభాగం పై సమీక్ష సమావేశం"




కడప మహి న్యూస్ అక్టోబర్ 26.: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా జి. రామ గోపాల్, చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు ఎస్. బాబా ఫక్రుద్దీన్, కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు పై సమావేశము నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు మాట్లాడుతూ పిల్లల కోసం న్యాయ సేవా విభాగం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ప్రతి చిన్నారి హక్కులను రక్షించడం. బాలలపై హింస, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు, అనాథ పిల్లల సంరక్షణ, బాల నేరస్తుల పునరావాసం వంటి అంశాల్లో అవసరమైన ఉచిత న్యాయ సహాయం అందించడం. అలాగే బాలల సంక్షేమ కమిటీలు, జువైనల్ జస్టిస్ బోర్డులు, చైల్డ్ కేర్ సంస్థలతో2 సమన్వయం చేసి పిల్లల సంక్షేమాన్ని కాపాడుతుంది. మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు మరియు మేధో వైకల్యం కలిగిన వారికి న్యాయ సహాయం అందించడానికి ఏర్పాటు చేయబడింది. వారి హక్కుల పరిరక్షణ, వివక్ష నివారణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చేయడం, అవసరమైన న్యాయ సలహాలు, కోర్టు సహాయం, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడం. మనందరం ఈ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, అవసరమైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందేలా సహకరించాలి. ఈ కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ యస్. ప్రసాద్, ఇతర ప్రభుత్వ శాఖ అధికారులు, న్యాయ సహాయ రక్షణ మండలి, ప్యానెల్ న్యాయవాదులు, పోలీస్ వారు, జైలు పర్యవేక్షకులు, పారా లీగల్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



## రాజంపేట సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రం తనిఖీ

### ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన




కడప జిల్లా, రాజంపేట అక్టోబర్ 26, మహి న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు, కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ గోపాల్ సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సోమవారం రాజంపేట సబ్‌జైలు, న్యాయ సహాయ కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన ఆయన న్యాయ సహాయ కేంద్రం ప్రాధాన్యతను వివరించారు. జైలులో ఖైదీలకు కల్పించాల్సిన హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సహాయ రక్షణ న్యాయవాదుల వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ఖైదీలు ఉచిత న్యాయ సహాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. అలాగే, న్యాయ సేవల సహాయవాణి 15100 నంబరుపై అవగాహన కల్పించారు. ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఎదురైతే రాజంపేట మండల న్యాయ సేవా సమితిని లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాదులు, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు, ఖైదీలు పాల్గొన్నారు.






## జమ్మలమడుగులో కూటమి నేతల ఇంటింటి ప్రచారం

### 24, 25, 26 వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం





కడప జిల్లా/జమ్మలమడుగు, అక్టోబర్ 26, (మహి న్యూస్): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 24, 25, 26 వార్డుల్లో ఎన్డీఏ కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి చదిపిరాళ్ల జ్యోతి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, భూపేష్ రెడ్డి సోదరి ప్రశాంతి పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు జంబాపురం రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జనసేన నాయకుడు నాగార్జున, మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు మల్లికార్జున, వార్డు అభ్యర్థులు పవన్ కుమార్, సాధకున్, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వాల్మీకి మహర్షి ఆశయాలు ఆదర్శనీయం

### విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి



కడప జిల్లా/జమ్మలమడుగు మహి న్యూస్ అక్టోబర్ 26: వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితాన్ని, ఆయన రచించిన రామాయణం ద్వారా సమాజానికి అందించిన విలువలను స్మరించుకున్నారు. వాల్మీకి మహర్షి రచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ధర్మం, సత్యం, న్యాయం, మానవీయ విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాల్మీకి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించడం ఆనందంగా ఉందని నాయకులు పేర్కొన్నారు.

# ఒంటిమిట్ట హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### రూ.50 వేల జరిమానా.. చెల్లించకపోతే మరో ఐదేళ్ల జైలు శిక్ష స్పెషల్ పీపీ, పోలీసు అధికారులను అభినందించిన జిల్లా ఎస్పీ



కడప, అక్టోబర్ 26, (మహి న్యూస్): ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు ధనుష్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ కడప ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి రమేష్ కుమార్ సోమవారం తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఐదేళ్ల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

**రూ.500 ఇవ్వలేదని హత్య**

ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామ సమీపంలోని శ్రీ సాయిరామ్ సిమెంట్ బ్రిక్స్ ఫ్యాక్టరీలో కత్తి వెంకటరమణ (50) వాచ్‌మెన్‌గా పనిచేసేవారు. అనాథ అయిన ధనుష్‌కు ఆశ్రయం కల్పించడంతో పాటు ఫ్యాక్టరీలో కూలీ పనులు కల్పించారు. అయితే తన ఖర్చుల కోసం రూ.500 ఇవ్వాలని ధనుష్ కోరగా వెంకటరమణ నిరాకరించారు. దీంతో కక్ష పెంచుకున్న ధనుష్ 2020 ఫిబ్రవరి 29 రాత్రి నుంచి మార్చి 1 తెల్లవారుజాము మధ్య ఫ్యాక్టరీ ప్రాంగణంలోని తూర్పు వైపు ఖాళీ స్థలంలో నిద్రిస్తున్న వెంకటరమణ తలపై బలమైన ఆయుధంతో దాడి చేసి హత్య చేసి పరారయ్యాడు.

**పకడ్బందీగా దర్యాప్తు**

మృతుడి కుమారుడు కత్తి భరత్ ఫిర్యాదు మేరకు ఒంటిమిట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, అవసరమైన ఆధారాలను సేకరించారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. ఈ కేసులో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది జి.ఎస్. శైలజ ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై హత్య నేరం రుజువైనట్లు నిర్ధారించి జీవిత ఖైదు, జరిమానా విధించింది.

**పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాది జి.ఎస్. శైలజతో పాటు కోర్టు పర్యవేక్షణ విభాగం హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు, కానిస్టేబుల్ శ్రీనివాసులు రెడ్డి, ఒంటిమిట్ట ఏఎస్ఐ సుబ్బయ్యలను జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు. కేసు విచారణలో సమన్వయంతో పనిచేసి న్యాయం జరిగేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ)ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలి..!

### జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి

### ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ తటస్థత పాటించాలి

### ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు



కడప, మహి న్యూస్ అక్టోబరు 26: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి అమల్లోకి వచ్చే ప్రవర్తనా నియమావళి నిబంధనలను ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, సామాజిక మాధ్యమాలు, ముద్రణ, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు గౌరవించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన వంటి కీలక దశలు కొనసాగుతున్న నేపథ్యంలో, తదుపరి ఉపసంహరణ, తుది అభ్యర్థుల జాబితా, ఎన్నికల ప్రచారం, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర దశల్లోనూ ఎన్నికల సంఘం నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో రాజకీయ తటస్థతను పాటించాలని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజలు నిబంధనలకు లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా జరిగేందుకు అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని ఆయన కోరారు.

**రాజకీయ కార్యకలాపాలకు ప్రభుత్వ ఉద్యోగులు దూరంగా ఉండాలి...**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల సిబ్బంది రాజకీయంగా పూర్తి తటస్థతను పాటించాలి. ఏ రాజకీయ పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా ప్రచారం చేయడం, ఓట్లు అభ్యర్థించడం, రాజకీయ సమావేశాలు, ర్యాలీల్లో పాల్గొనడం వంటి చర్యలకు దూరంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ తదితర సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీలకు అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేసే పోస్టులు పెట్టడం, వాటిని పంచుకోవడం, ఇష్టపడినట్లు గుర్తించడం, వ్యాఖ్యలు చేయడం వంటి చర్యలు చేపట్టకూడదు.

**ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు...**

ప్రభుత్వ వాహనాలు, నిధులు, కార్యాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ అతిథి గృహాలు, ఇతర ప్రభుత్వ వనరులను ఎన్నికల ప్రచారానికి వినియోగించరాదు. ప్రభుత్వ నిధులతో అధికార పార్టీ విజయాలు, పథకాలను ప్రచారం చేసే ప్రకటనలు జారీ చేయకూడదు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్న సమయంలో నిబంధనలకు విరుద్ధంగా కొత్త ఆర్థిక ప్రయోజనాలు ప్రకటించడం, కొత్త పథకాలు ప్రారంభించడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల నిర్వహణకు ప్రభుత్వ అధికారులు సహకరించరాదు.

**అధికారిక పర్యటనల్లో ఎన్నికల ప్రచారానికి తావివ్వరాదు...**

మంత్రులు, ఇతర రాజకీయ నాయకులు అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంతో ముడిపెట్టినప్పుడు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వారికి సహకరించరాదు. ఎన్నికల విధులతో సంబంధం ఉన్న అధికారుల బదిలీల విషయంలో ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన అనుమతులు పొందిన తరువాతే చర్యలు చేపట్టాలి. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సంబంధిత అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సెలవులు మంజూరు చేయరాదని సూచించారు.

**నగదు, విలువైన వస్తువుల తరలింపులో నిబంధనలు పాటించాలి...**

ఎన్నికల సమయంలో నగదు, బంగారం, వెండి, బహుమతి వస్తువులు తదితరాలను అనుమానాస్పదంగా లేదా నిబంధనలకు విరుద్ధంగా తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్ణీత పరిమితులకు మించి నగదు లేదా విలువైన వస్తువులను తీసుకెళ్లాల్సిన సందర్భాల్లో సంబంధిత ఆధారాలు వెంట ఉంచుకోవాలి. ఎన్నికల నిఘా బృందాలు తనిఖీలు నిర్వహించినప్పుడు అవసరమైన వివరాలు, పత్రాలను అందించి సహకరించాలి.

**పోలింగ్ కేంద్రాల్లో నిష్పాక్షికంగా వ్యవహరించాలి...**

పోలింగ్ రోజున ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలకు పాల్పడకూడదు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాలి. పోలింగ్ ఏజెంట్ల గుర్తింపు స్లిప్పులు తెల్ల కాగితంపై మాత్రమే ఉండేలా, వాటిపై రాజకీయ పార్టీ గుర్తులు లేదా అభ్యర్థుల పేర్లు లేకుండా చూడాలి. ఎన్నికల విధుల్లో ఉన్న ఉన్నతాధికారులు, తనిఖీ బృందాలకు పూర్తి సహకారం అందించాలి.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు...**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించినా సంబంధిత నిబంధనల మేరకు క్రమశిక్షణా చర్యలు చేపట్టే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పాక్షికంగా జరిగేందుకు ప్రజలు, ఉద్యోగులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్ని మాధ్యమాల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## అవినీతికి పాల్పడే వారిపై ఏసీబీకి ఫిర్యాదు చేయండి...!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### 1064 టోల్‌ఫ్రీ నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలి




కడప,మహి న్యూస్ అక్టోబరు 26: ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా ప్రజలు నిర్భయంగా అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సూచించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సేవలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు పొందే సమయంలో ప్రజలు లంచం ఇవ్వాల్సిన పరిస్థితులు ఎదురైతే వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064తో పాటు, వాట్సాప్ నంబర్ 94404 40057 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చనే విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు. ఏసీబీ ఫిర్యాదు నంబర్లను ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించి, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కడప రేంజ్ ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. నాగరాజు, సంబందిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

### జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్. రాధిక

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 26: ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎల్. రాధిక, ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ సూచించారు. సోమవారం దిశ ఆధ్వర్యంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రిలోని ఏఆర్‌టీ కేంద్రంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్‌టీ సిబ్బంది, ఎల్‌డబ్ల్యూఎస్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను నెలలోపు పూర్తి చేయాలని సూచించారు. హెచ్‌ఐవీ నియంత్రణలో మొదటి 95, రెండో 95, మూడో 95 లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్‌ఐవీ పరీక్షా శిబిరాలు నిర్వహించడంతో పాటు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మొబిలైజేషన్ ఆఫ్ ఎయిడ్స్ సురక్ష (ఎంఏఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాల అమలుపై శాక్స్, దిశ సంస్థలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హుమాయూన్, మేఘన, కౌన్సిలర్లు జయకుమార్, పురుషోత్తం,చంద్రమోహన్,ఎన్జీవో ప్రతినిధులు పీవో పురుషోత్తం,శ్రీనివాసులు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ విమర్శల కోసం అధికారులను లక్ష్యంగా చేసుకోవద్దు

### మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరోపణలను ఖండించిన ఎన్నికల అధికారులు

# ఎన్నికల అధికారులపై అసత్య ఆరోపణలు తగదు!

కడప జిల్లా/ప్రొద్దుటూరు, మహి న్యూస్, అక్టోబరు 26: ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులపై ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకున్నారంటూ ఆరోపణలు చేయడం తగదని ప్రొద్దుటూరు పురపాలక సంఘం ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. రాజకీయ విమర్శల కోసం ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చేసిన ఆరోపణలను ఎన్నికల అధికారులు సంయుక్తంగా ఖండించారు. ఎన్నికల సంఘం నిబంధనలు, ఉన్నతాధికారుల మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ల స్వీకరణ నుంచి ఉపసంహరణ వరకు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని తెలిపారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారమే చేపడుతున్నామని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

**అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయొద్దు**

ప్రజాస్వామ్యంలో విమర్శలకు అవకాశం ఉన్నప్పటికీ, ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తుందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ఏవైనా అనుమానాలు ఉంటే సంబంధిత ఆధారాలతో అధికారికంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రజల్లో అపోహలు సృష్టించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

**ఆరోపణలు అవాస్తవం: మున్సిపల్ కమిషనర్**

తన విధుల నిర్వహణలో ఎలాంటి అక్రమాలకు, పక్షపాతానికి తావివ్వలేదని అసిస్టెంట్ ఎన్నికల అధికారి, ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ స్పష్టం చేశారు. డబ్బులు తీసుకున్నానంటూ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగానే విధులు నిర్వహిస్తున్నామని, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడేందుకు అధికారులంతా సమష్టిగా కృషి చేస్తున్నారని తెలిపారు.



తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

**ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి**

ఎన్నికల విధుల్లో పనిచేస్తున్న అధికారుల గౌరవాన్ని కాపాడటం, వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీయకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎన్నికల అధికారులు అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత, రాజకీయ విమర్శలకు అధికారులను లక్ష్యంగా చేయకుండా ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రకటనలో ఎన్నికల అధికారులు వి. హరి ప్రసాద్, ఎస్. సఫీ ఉల్లా బాషా, వి. భాస్కర్, బి.పి. సంతోష్ కుమార్, పి. లక్ష్మీనరసింహులు, జె. శివకుమార్, కె. మంజునాథ్, ఎం. చంద్రఓబుల్ రెడ్డి, పి. పరమేశ్వరరెడ్డి, బి. నరేంద్ర పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com